
జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 09, జూన్ 2024

## అక్షరనివాళి



## కీ.శే. చెరుకూరి రామోజీ రావు

### రామోజీ గ్రూపు అధినేత

సామన్యుడుగా జీవన ప్రయాణం మెదలు పెట్టి.. అక్షరంతో లక్షల మందికి ఉపాధి కల్పించి..
పాత్రికేయ వృత్తికి గౌరవం తెచ్చి ఎందరికో ఆదర్శంగా నిలిచిన అక్షర యోధుడు
రామోజీరావు భౌతికంగా ఇక మన మధ్య లేరనే నిజాన్ని జీర్ణించుకోలేనిది..
వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుని ప్రార్థిస్తూ..వారికి ఇదే మా ఘననివాళి

జనం గుండె చప్పుడు
మహానాడు ™
Mahanaadu Media

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 09, జూన్ 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




# జగన్ శత్రువు జగనే!

(మార్తి సుబ్రహ్మణ్యం)

మనిషికి శత్రువు మనిషే. జగన్‌కు శత్రువు జగనే! ఈ ఐదేళ్ల కాలంలో జగన్ నైజం అనుభవించిన ఆంధ్రా ప్రజలకు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. జగన్ పతనాన్ని శాసించింది జనం అనుకుంటే పొరపాటు. చంద్రబాబు ఓడించారనుకుంటే మహా పొరపాటు. తన పతనాన్ని తానే శాసించుకున్నారాయన. అలాంటి అవకాశం జగన్ జనాలకు ఇవ్వదలచుకోలేదని ఫలితాలే స్పష్టం చేశాయి. మూర్తీభవించిన అహంకారం, నిలువెల్లా నియంతృత్వం, సర్వజనులూ తనకు సాగిలబడాలన్న శాడిజం, ఎదుటివారిని గౌరవించకుండా అవమానించే కండకావరం, ప్రత్యర్థులను వేటాడే ఆటవికోన్మాదం.. వీటికిమించి తానొక దైవాంశసంభూతుడినన్న వెర్రి భమలు. కలసి వెరసి ఒక జగన్! ఇదీ ఇప్పుడు కళ్లు తెరిచి నిజం తెలుసుకున్న వైకాపేయుల భావన.

ఐదేళ్లపాటు ఆయనలోని శాడిజాన్ని దగ్గరుండి చూసిన వారికి ఈ వర్ణన పాతదే కావచ్చు. కానీ బయట నుంచి చూసే మహాజనులకు మాత్రం కొత్తదే. జగన్ చుట్టూ ఉన్న 'విజ్ఞానవంతులనుమనుకునే' అజ్ఞానులే, ఆయనను భస్మాసురుడిగా మార్చారన్నది నిష్ఠురనిజం. లేకపోతే వారెంత? వారికి ఉన్న రాజకీయ అనుభవమెంత? వారిచ్చే బోడి సలహాలేమిటి? వాటిని జగన్ మతిలేకుండా గతితప్పిన వారి సలహాలు పాటించడమేమిటి? ఆ ప్రభావమే జగన్‌ను 11 మంది ఎమ్మెల్యేల నాయకుడిగా దిగజార్చిందన్నది.. జగన్‌ను జగజ్జేతగా భావించే అభిమానుల నిశ్చితాభిప్రాయం.

రాజకీయ నేతలు సంపాదన సంగతి పక్కనబెడితే.. గౌరవం ఆశిస్తారు. అధినేతల వద్ద తమ మనోభావాలు వెళ్లబోసుకోవాలనుకుంటున్నారు. ప్రజల పల్సును అధినేత దృష్టికి తీసుకువెళ్లాలని పరితపిస్తుంటారు. వాటిని అమలుచేయాలా? వద్దా అన్నది అధినేతల నిర్ణయమయితే, కనీసం వాటిని వినడం నాయకుడి ధర్మం. చంద్రబాబుగానీ, వైఎస్ దగ్గర ఈ లక్షణాలు బాగా కనిపించేవి. కానీ అదెక్కడా ఈ ఐదేళ్లలో జగన్ తన పరివారానికి ఇచ్చిన దాఖలాలు భూతద్దం పెట్టి వెతికినా కనిపించవు. రెండుమూడుసార్లు మంత్రులుగా చేసిన వారిని సైతం సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ధనంజయరెడ్డి ఎదుట ముద్దాయిలుగా నిలబెట్టిన అహంకారిగా జగన్ ముద్రపడ్డారు. అసలు రాజకీయాల్లో వీరి అనుభవం ఎంత? చంద్రబాబును ఢీకొట్టడం అటుంచి, ఆయన వ్యూహాలు పసిగట్టే స్థాయి-అనుభవం-తెలివి వీరిలో ఎంతమందికి




ఉందన్నది ప్రశ్న. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి, జక్కంపూడి పార్టీ ఓటమికి సీఎంఓ కార్యదర్శి ధనంజయరెడ్డి అహంకారమే కారణమని నిర్మొహమాటంగా చెప్పారు. తమను గంటలపాటు చాంబరు బయట నిలబెట్టిన ధనంజయరెడ్డి అహంకారం ముందు, తమ అనుభవం అవమానించబడిందన్నది వారి ఆవేదనలో అణువంతయినా అబద్ధం లేదు. ఇప్పుడు బయటపడింది ఈ ముగ్గురే కావచ్చు. కానీ ఆగ్రహంతో రగిలిపోతున్న అందరి అంతరంగం ఇదేనన్నది.. మనం మనుషులం అన్నంత నిజం.

జగన్ చేయాల్సిన ఆలోచలన్నీ ఆయనే చేసి, అమలు చేయడం వల్లే పార్టీ కూలి నేలరాలిందన్నది వారి ఆగ్రహం. నియోజక వర్గ అభివృద్ధి కోసం ధనంజయరెడ్డి దగ్గర సాగిలబడి, నిధులు అడుక్కోవలసిన ఖర్మ పట్టిందన్న వారి మనోవేదనకు బాధ్యుడు జగనే. ఆయన చాంబరు దగ్గర మిగతా.. 2లో

# అస్తమించిన అక్షర సూరీడు!



- 'ఈనాడు' రామోజీ మహాభిప్క్రమణం
- అక్షర ప్రపంచాన్ని శాసించిన రారాజు
- తెలుగు జర్నలిజాన్ని కొత్తమార్గం పట్టించిన మీడియా మొఘల్

(అన్వేష్)

'మీడియాతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయ్'.. రాజకీయవర్గాల్లో ఈ భావన - భయం జమిలిగా జనించేందుకు కారకులైన ఈనాడు అధినేత రామోజీరావు ఇక లేరు. శనివారం తెల్లవారురఝామున అక్షరాకాశంలో అంతర్ధానమయ్యారు. తెలుగునేల నలుచెరుగులా వెదజల్లిన అక్షరమొక్కలను శ్వాసిసూ, శాసిస్తూ ఇక సెలవంటూ వెళ్లిపోయారు.

అక్షర సామ్రాజ్యంలో సంపూర్ణ విజయాలను సాధించిన పెద్దాయన రామోజీ గురించి ఎంత చెప్పినా తక్కువ. పాతుకుపోయిన కాంగ్రెస్ సామ్రాజ్యాన్ని తెలుగుదేశం అనే ఆయుధంతో కూకటివేళ్లతో పెళ్లగించి, రాజకీయులకు పత్రిక సత్తా ఏమిటో రుచిచూపించిన రామోజీకి ఎంతమంది అభిమానులో, అంతమంది ప్రత్యర్థులు. ఆయనపై ప్రశంసలెన్నో, విమర్శలన్ని! ప్రత్యర్థులు సైతం మెచ్చుకునే సాహసి రామోజీ. తెలుగు గడ్డపై రామోజీ ఫిలిం సిటీ అనే సినీ సామ్రాజ్యం నెలకొల్పినా.. ఈటీవీతో న్యూస్ చానెల్ ఆరంభించినా.. మార్గదర్శి పేరుతో చిట్‌ఫండ్ ప్రారంభించినా.. చిన్న తారలకు వెలుగునిచ్చేందుకు, సినిమాలు తీసినా రామోజీ అడుగు-ఆలోచన భిన్నం. రాజ్యసభ సీటు ఇచ్చేందుకు ఎంతోమంది ముందుకొచ్చినా, అక్షరాన్నే మిగతా.. 2లో



ప్రత్యేక కథనాలు, వార్తలు లోపలి పేజీల్లో..



## రవాణా మంత్రి పొన్నం
# రూ.100 కోట్ల కుంభకోణం

- వే బిల్లులు లేకుండా బూడిద అక్రమ రవాణా
- రోజుకు 200 నుంచి 300 లారీల తరలింపు
- రోజుకు రూ.50 లక్షల పైనే అక్రమ సంపాదన
- వెంటనే ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్
- తరలుతున్న ఫ్లై యాష్ లారీల పట్టివేత

హుజురాబాద్: రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా సంస్థ అధికారులతో కుమ్మక్కై రోజుకు రూ.50 లక్షలు సంపాదిస్తున్నారని హుజురాబా ద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మిగతా.. 2లో

# మీడియాకు దార్శనికుడు రామోజీ

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మహానాడు: రామోజీరావు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావు గారికి దక్కుతుందన్నారు. రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి అని ప్రశంసించారు. ఈనాడు పత్రికను నెంబర్ వన్ స్థానంలో నడపడం, ఈటీవీ స్థాపనతో టీవీ మీడియా రంగానికి దశదిశా చూపిన దార్శనికుడు అని కొనియాడారు. ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయనతో భేటీ అయిన విషయా న్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు తెలుగు మీడియా రంగానికి, వ్యాపా ర రంగానికి తీరని లోటు అని, అక్షర వీరుడు రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.





# రామోజీరావు వ్యక్తి కాదు.. వ్యవస్థ

- ధర్మానికి కట్టుబడి సమాజహితం కోసం అనునిత్యం పని చేశారు
- రామోజీరావు మరణం జీర్ణించుకోలేనిది
- రామోజీరావు పార్థీవదేహానికి నివాళులర్పించిన టీడీపీ అధినేత చంద్రబాబు దంపతులు

అమరావతి: యుగపురుషుడిలా వెలిగిన రామోజీరావు మరణం జీర్ణించుకోలేనిదని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సమాజ హితం కోసం అనునిత్యం కష్టపడ్డ వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. హైదరాబాద్ లోని ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థీవదేహానికి పూలమాల వేసి చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి నివాళులర్పించారు. రామోజీ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ....'రామోజీరావు మృతి బాధాకరం. రామోజీరావు నాకు 40 ఏళ్లుగా సుపరిచితులు. అనునిత్యం తెలుగు జాతి కోసం, సమాజ హితం కోసం ఆయన కృషి చేశారు. మామూలు గ్రామంలో జన్మించిన ఆయన అసాధారణ విజయాలు సాధించారు. వ్యవస్థలను మిగతా.. 2లో

## ఆరోగ్యశ్రీలో అదనంగా
# 65 కొత్త చికిత్స విధానాలు అమలు

- 1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంపు
- వీటికి గాను 487 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, మహానాడు: రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకం లోని చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా శనివారం ఈ నిధులను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కొత్త చికిత్సా విధానాల కొరకు మరియు ప్రస్తుతము ఉన్న పథకాల ఆర్థిక సవరణ కొరకు మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లుతో జూన్ 7న రాష్ట్ర సచివాలయం లో సమావేశం జరిగింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వము 2007లో పేద మిగతా.. 2లో

# వాసుదేవరెడ్డికి చుక్కలే!

- వాసుదేవరెడ్డి భూ కొనగోళ్లపై సీఐడీ నజర్?
- గౌరవరంలో భారీగా భూముల కొనుగోలు?
- 40 ఎకరాల భూమి మామ నుంచి గిఫ్ట్ డీడ్?
- 25 ఎకరాల భూమి పుల్లారెడ్డి కొనుగోలు?
- విచారణకు సిద్ధమవుతున్న బాబు సర్కారు



హైదరాబాద్, మహానాడు: తెలంగాణకు చెందిన వాసుదేవ రెడ్డి రైల్వేలో ఐఆర్‌టీఎస్ అధికారి. అనంతపురం జిల్లా గుంత కల్లులో పనిచేస్తూ వైసీపీ నేతలతో సంబంధాలు పెంచుకున్నారు. జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డితో సాన్నిహిత్యం బాగా పెరిగింది. మిగతా.. 2లో



కట్టుదిట్టంగా చంద్రబాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లు
7లో



రామోజీరావుది మహాభినిష్క్రమణే
6లో



విజయానికి ఎమోజీ.. రామోజీ..!
3లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 09, జూన్ 2024



## ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్స విధానాలు అమలు

(మొదటిపేజీ తరువాయి..)

ప్రజలకు నాణ్యమైన వైద్యము అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారు.

ఈ పథకం కింద 2.84 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 10 లక్షల వరకు ఆర్థిక సహాయం ఈ పథకం ద్వారా అందుతుంది. రాష్ట్రంలో ఈ సదుపాయము 1402 ఆసుపత్రుల ద్వారా అందించబడుతుంది.

ప్రస్తుతము ఈ పథకంలో 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం నిర్ణయం తీసుకున్నారు.

ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇకనుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించారు.

వీటికి తోడు ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ లో ఉన్న 98 చికిత్సా విధానాలు రాజు ఆరోగ్యశ్రీలో చేర్చడం వల్ల దాదాపు 189.83 కోట్ల ఖర్చు ప్రభుత్వం పై పడనుంది. అంతే కాక, 65 కొత్త చికిత్సా విధానాలు అంగీకరించడం వల్ల ప్రభుత్వ%శీ% 158.20 కోట్ల ఖర్చు చేయనుంది.

పై సవరణల వల్ల, మరియు కొత్త చికిత్సా విధానాలు చేర్చడం కోసం, ప్రభుత్వం అదనంగా 497.29 కోట్లు ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మంజూరు చేశారు.



సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరయ్యేందుకు ఢిల్లీ వెళ్లిన సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీలను మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

## రామోజీరావు వ్యక్తి కాదు.. వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి..)

నిర్మించారు. మార్గదర్శి, ఈనాడు, ఈటీవీ వంటి సంస్థలతో ప్రజలకు చేరువయ్యారు. ఏ ఇంట్లోనైనా నిద్ర లేవగానే ఈనాడు చదవితేనే బయటకు వస్తారు. ప్రజల్ని చైతన్య పరచడానికి రాజీలేని పోరాటం చేశారు.

తాను చెప్పినట్లుగానే రామోజీరావు ధర్మం వైపు నిలబడి మంచి కోసం పని చేశారు. చనిపోయే వరకు అనునిత్యం పని చేసి...పనిలో ఉండగా చనిపోతేనే ఆనందంగా ఉంటుందని కోరుకున్న వ్యక్తి ఆయన. రామోజీరావు స్థాపించిన ఈనాడు, ఈటీవీ, ఇతర సంస్థలు ఎప్పటికీ శాశ్వతంగా ఉంటాయి. మీడియా రంగంలోనే కాకుండా చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు అందించారు. దేశంలోనే అత్యున్నత ప్రమానాలతో రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించారు.

ఫిల్మ్ సిటీ వల్ల హైదరాబాద్ లో టూరిజం పెరిగి రాష్ట్రానికి ఆదాయం వచ్చింది. అలాంటి ఆలోచనలు చేసిన మహావ్యక్తి దూరమవ్వడం బాధాకరం. తెలుగుజాతి వెలుగు రామోజీరావు. తెలుగుజాతి గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉంటారు. రామోజీరావు లేకపోయినా ఆయన రగిల్చిన స్ఫూర్తి అందరిలో ఉంటుంది. అనేక సందర్భాల్లో రామోజీరావుతో చర్చించి నేను నిర్ణయాలు తీసుకున్నాను" అని చంద్రబాబు నాయుడు కొనియాడారు.

## వాసుదేవరెడ్డికి చుక్కలే!

(మొదటిపేజీ తరువాయి..)

2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయనకు జగన్ బేవరేజెస్ కార్పొరేషన్ అప్పగించారు.

ఎన్నికల సమయంలో వాసుదేవరెడ్డి వైసీపీ నేతలకు పూర్తిస్థాయిలో మద్యం అందుబాటులో ఉంచారు. డిపోల నుంచే ట్రక్కుల్లో రవాణా చేయించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. దీంతో ఆయనను ఈసీ పదవి నుంచి తప్పించింది.

వాసుదేవరెడ్డి మామ మారెళ్ల పుల్లారెడ్డి. ఆయన... వైసీపీ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు వియ్యంకుడు. ఆయన స్వగ్రామమైన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వాసుదేవ రెడ్డి అక్రమార్జనలో కొంత భాగం ఇక్కడ భూములపై పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 సెప్టెంబరులో వాసుదేవరెడ్డి భారీగా భూములు కొన్నట్లు సమాచారం. సుమారు 40 ఎకరాల భూమిని తన మామ నుంచి గిఫ్ట్ డీడ్ రూపంలో పొందారు. ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో సుమారు 25 ఎకరాల భూమిని పుల్లారెడ్డి కొనుగోలు చేశారు. సీఐడీ దీనిపైనా దృష్టి సారించే అవకాశముంది.

## రవాణా మంత్రి పొన్నం రూ.100 కోట్ల కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి..)

ఆరోపించారు. శనివారం వే బిల్లులు లేకుండా అధిక లోడ్ రూల్ ప్రకారం 32 టన్నులతో వెళ్లాల్సి ఉండగా 80 టన్నుల లోడ్ తో వెళుతున్న ఫ్లై యాష్ లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వందల నుంచి మూడు వందల లారీలు రామగుండం ఎన్ టీపీసీ నుంచి ఖమ్మం వైపు వే బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. మంత్రి కనుసనల్లోనే ఈ అక్రమ ఫ్లై యాష్ రవాణా జరుగుతుంద న్నారు. ఒక్కో లారీలో సుమారు 70 నుంచి 100 టన్నులు కూడా ఉంటుందని తెలిపారు. ఇంత పెద్ద స్కాంను నేరుగా పట్టుకున్నామని చెప్పారు. ఒక లారీ వెళ్లడానికి సుమారు 25 వేల వరకు ఖర్చు అవుతుందని, అందులో కేవలం 32 టన్నులు వెళ్లడానికి మాత్రమే అనుమతులు ఉంటాయని అన్నారు. అలాంటిది 70 నుంచి 100 టన్నులతో వరకు తీసుకువెళుతున్నారని అన్నారు. అక్రమంగా తరలిస్తున్న దానిపై వచ్చే ఆదాయం ఒక్కో లారీకి రూ.40 వేల వరకు ఉం టుందని వివరించారు. అలా రోజుకు 200 నుంచి 300 లారీలు వెళితే సుమా రు 50 లక్షల వరకు అవుతుందని అన్నారు. మంత్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రోజుకు 50 లక్షలు సంపాదిస్తున్నారని, ఇప్పటివరకు రూ.100 కోట్ల స్కామ్ చేశారని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రామోజీ మృతికి కేసీఆర్ సంతాపం



హైదరాబాద్: రామోజీరావు మృతికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవ స్థాపకుడిగా వారందించిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జగన్ శత్రువు జగనే!

(మొదటిపేజీ తరువాయి..)

చకోరపక్షుల్లా కావలికాసి, ఫోన్లు కూడా తీయని ధనంజయరెడ్డికి రాజకీయ వ్యూహరచన చేసేంత అనుభవం ఎక్కడుంది?

సీఎం సొంత జిల్లా, బంధువన్న ఏకైక కారణం తప్ప, మంత్రులు సైతం ఆయన చాంబరు దగ్గర వేచి ఉండటానికి మరేం అర్హత ఉంది? చూడ్డానికి ఇది ధనంజయరెడ్డిపై తిరుగుబాటుగానే కనిపిస్తున్నా, నిజానికి ఈ తిరుగుబాటు బావుటా జగన్‌పైనే. జగన్ అవకాశం ఇవ్వకపోతే ధనంజరెడ్డి వంటి అధికారులు నేతలపై పెత్తనం చెలాయించరుకదా?

నిజానికి ఈ ఐదేళ్లలో జగన్ ఒక్క ఎమ్మెల్యేకూ అపాయింట్‌మెంట్ ఇచ్చిన దాఖలాలు లేవు. అంటే వారంతా తన స్థాయి కాదన్నది అసలు అహంకారం. ఏమున్నా సజ్జల రామకృష్ణారెడ్డికి చెప్పుకోవడమే. అసలు సజ్జల రాజకీయ అనుభవం ఎంత? ఆయనెప్పుడైనా క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారా? ఒక పార్టీకి కార్యకర్తగా జెండా మోశారా? పూర్వాశ్రమంలో జర్నలిస్టుగా పనిచేసిన సజ్జలకు, రాజకీయ నిర్ణయాలు తీసుకునేంత అవగాహన ఉంటుందా? ఎత్తుగడలు-ఎత్తుపైఎత్తులు-వ్యూహరచన చేసే తెలివి ఉందా?

రోజా మీడియాలో ఎదురుదాడి చేస్తే సరిపోతుందా? కార్యకర్తల పల్స్ తెలిసే ఎమ్మెల్యే, నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వరా? వాలంటీర్లతో ఎమ్మెల్యేలు-నాయకులను నామమాత్రావశిష్టులను చేసి, నేరుగా జగన్ టు ఓటరుతో సరిపుచ్చే అతితెలివి ఆలోచనను నాయకులు స్వాగతిస్తారా? అసలు సజ్జలకు పెత్తనం ఇస్తే పార్టీ పెరుగుతుందా? మునుగుతుందా అన్న తెలివి లేదా? ఇవన్నీ.. ఎమ్మెల్యేలను ఆయన దయాధర్మానికి విడిచిపెట్టిన జగన్ తొలిరోజుల్లోనే ఆలోచిస్తే, ఈ పతనం తప్పేదన్నది పార్టీవాదుల వాదన. క్షవరం అయితే గానీ వివరం తెలియదు మరి. ఇప్పుడు జగన్‌కు క్షవరం అయింది. మరి వివరం తెలిసిందా?

పార్టీ ఎలా విజయం సాధించాలని సూక్తులు చెప్పి, చాలాకాలం చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి ఎంపీగా పోటీ చేసి ఎందుకు ఓడిపోయారు? అభ్యర్థులకు ఉపదేశించిన వ్యూహాలు, తన గెలుపునకు ఎందుకు పనిచేయలేదు? జనంలో లేని వారు ఒక్కసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తే ఫలితాలు ఇంతకు భిన్నంగా ఎందుకు ఉంటాయి?

ప్రజాస్వామ్యంలో బ్రూట్ మెజారిటీ ఎవరికీ మంచిదికాదు. అది నాయకుడిని నియంతను చేస్తుంది. కళ్లు నెత్తికెక్కేలా ఆ మెజారిటీ కిక్కు ఇస్తుంది. ఆ సంఖ్య నాయకుడిని భ్రమల్లో బతికిస్తుంది. మళ్లీ మేమే వస్తామన్న భ్రమ రేపుతుంటుంది. ప్రజల మనోభావాలేమిటన్నది ఆ కిక్కు తెలియనివ్వదు. మంచి చె ప్పిన వారిని దూరం పెట్టేలా చేస్తుంది. సద్విమర్శలను కూడా భరించే శక్తి ఉండదు. అన్నీ తనకు తెలుసన్న అహంకారం ప్రవేశిస్తుంది. ఆ అహంకారమే పతనానికి నాంది అవుతుంది.

ఏబీ వెంకటేశ్వరరావు అనే సీనియర్ ఐపిఎస్‌కు, ఐదేళ్లు పోస్టింగ్ ఇవ్వకుండా చేసిన జగన్ పైశాచిక ఆనందం, ఐదేళ్లు మిగిలిన అధికారులను ఆయనను ప్రశ్నించే అవకాశం లేకుండా చేసి ఉండవచ్చు. కానీ చప్రాసీలు కూడా ఈర్ష్యపడేలా ఊడిగం చేసి, ఇప్పుడు పోస్టింగులు లేని పరిస్థితి అనుభవిస్తుంది ఎవరు? ఏబీ అనే అధికారికి పోస్టింగ్ ఇవ్వమని కోర్టులు చెప్పినా, అమలుచే యకుండా కోట్లు ఖర్చు పెట్టి ఆయనను వేధించే శాడిజం వల్ల జగన్ సాధించేదేమిటి? వృధా అయిన అన్ని కోట్ల ప్రజాధనం ఎవడబ్బ సొమ్ము? కోర్టు దయాధర్మంతో బెయిల్‌పై బతుకున్న ఒక వ్యక్తి సీఎం అయితే.. వారిలోని క్రూరత్వం ఇంత అమానవీయంగా, ఇంత రాక్షసత్వంగా, హిట్లర్, ముస్సోలిని, బాబర్, ఔరంగజేబు, తుగ్లక్ అంశ ప్రవేశిస్తుందా? ఇదెవరి తప్పు? అలాంటి వారికి అవకాశం ఇచ్చిన రాజ్యాంగానిదా? ప్రజలదా?

మధ్యలో మిడిమిడి జ్ఞానపరులు, 'కుల'వేల్పులు, భజనపరులు, పైరవీకారులు ప్రవేశిస్తారు. వారి సలహాలతో రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేసి, ప్రత్యర్థి పార్టీని నిర్వీర్యం చేయాలనుకుంటారు. ఫలితంగా అహంకారి కాస్తా నియంతగా రూపాంతరం చెందుతారు. ఆ ఘర్షణలో జనం మేల్కొంటారు. సొంత పార్టీ వాళ్లు సైతం జారుకుంటారు. పరాజయం తర్వాత వెనక్కి తిరిగిచూస్తే ఎవరూ ఉండరు. ఉమ్మడి-విభజన తర్వాత చాలామంది సీఎంలను చూసిన వారు ఇప్పటివరకూ దర్శించిన అనుభవం ఇదే. అందుకు ఎవరూ మినహాయింపు కాదు.

'అసలు ఈ ఐదేళ్లూ రాష్ట్రాన్ని పాలించింది జగన్ కాదు. ఈ పులివెందుల ముఠానే. భారతీరెడ్డి ఆదే శాల మేరకే పాలన సాగింద'న్న వైకాపేయుల మనోభావనను కొట్టిపారేయలేం. సజ్జల, ధనంజయరెడ్డి, అవినాష్ చుట్టూనే పాలన సాగిందన్నది వారి విమర్శలను త్రోసివేయలేం. ఆమేరకు ప్రజల పల్సు తెల్సిన గోనె ప్రకాష్‌రావు, తెలంగాణ నుంచి ఆంధ్రాకు వె ళ్లి మరీ చెప్పాల్సిన పనిలేదు. కడప జిల్లాలో ఏ చెట్టునడిగినా చెబుతుంది. పులివెందులలో ఏ పుట్టనడిగినా చెబుతుంది.

ఇప్పటికయినా మించిపోయింది లేదు. రాజకీయాల్లో గెలుపు-ఓటమి సహజం. జనం దయతలిస్తే, పడిన వారు మళ్లీ లేస్తుంటారు. ఇప్పటి చంద్రబాబు మాదిరిగా! జగన్‌కు ఇంకా బోలెడు వయసుంది. లేనిదల్లా.. వినే ఓపిక. ఎదుటివారిని గౌరవించే తత్వం. అన్నీ తనకు తెలుసుననే అహంకారం. తానొక దైవాంశసంభూతుడినన్న వెర్రి భ్రమనే! దానిని జమ్మిచెట్టు మీదకెక్కించి, ప్రజాస్వామ్యయుత నిర్ణయాలు తీసుకుంటే ఆయన భవిష్యత్తుకే మంచిది.

ప్రభుత్వంపై సద్విమర్శలు చేసి, జనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడితే ప్రజలే చేరువవుతారు. కానీ కోటి ఆశలతో, తనపై కసితో గెలిపించిన కూటమికి కొద్దికాలం సమయం ఇవ్వాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది. ఎందుకంటే తాను ధ్వంసం చేసిన వ్యవస్థలను చక్కదిద్దడానికి, కొత్త పాలకుడికి సమయం ఇవ్వాలి కదా? అప్పటివరకూ తను బుద్ధిమంతుడిగా మారి, ఇల్లు చక్కదిద్దుకుంటే మేలు. ఎందుకంటే ఇప్పుడు జగన్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కాదు. కేవలం ఒక ప్రతిపక్షపార్టీ నాయకుడు మాత్రమే. బోలెడు ఖాళీ ఉంటుంది కాబట్టి తనలోని శత్రువును బయటకు పంపిస్తే, భవిష్యత్తు ఆశాజన కంగానే కనిపిస్తుంది.

## అక్షర శిల్పి రామోజీ

చెరుకూరి రామోజీరావు ఒక భారతీయ వ్యాపారవేత్త, ఈనాడు గ్రూపు సంస్థల అధినేత. తెలుగు దినపత్రిక ఈనాడుకు వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు, ప్రచురణ కర్త. మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి మొదలగు వ్యాపార సంస్థలకు అధినేత. రామోజీరావు స్థాపించిన రామోజీ గ్రూపు ఆధీనంలోని ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఉంది. 2016లో భారత ప్రభుత్వం రామోజీని దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

### కుటుంబ నేపథ్యం ఇదీ...

రామోజీరావు కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవంబరు 16న రైతు కుటుంబంలో జన్మించాడు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి వెంకట సుబ్బారావు. రామోజీరావు పూర్వీకులు పామర్రు మండలం పెరిశేపల్లి గ్రామానికి చెందిన వారు. అతని తాత రామయ్య కుటుంబంతో పెరిశేపల్లి నుంచి పెదపారుపూడికి వలస వచ్చాడు. రామోజీరావు తాత మరణించిన 13 రోజులకు జన్మించాడు. దాంతో అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు రామయ్య అన్న పేరు



పెట్టారు. ఇతని కన్నా ముందు ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్దక్క పేరు రాజ్యలక్ష్మి, చిన్నక్క పేరు రంగనాయకమ్మ.

### బాల్యం, విద్యాభ్యాసం, వివాహం

రామోజీ కుటుంబానిది శ్రీ వైష్ణవ నేపథ్యం. తల్లి చాలా భక్తిపరురాలు, ఆచార వంతురాలు కావడంతో చిన్నతనంలో భక్తి, శుచి అలవడిరది. లేకలేక పుట్టిన మగసంతానం కావడంతో రామోజీని చాలా ముద్దుచేసే వారు. పెద్దక్క పెళ్లి చేసుకుని వెళ్లిపోయినా చిన్నక్క రంగనాయకమ్మతో ఎంతో ప్రేమగా ఉండేవారు. ఇంట్లో తల్లికి ఇంటి పనుల్లో, వంటలో సహాయం చేసే అలవాటూ ఉండేవి. రామయ్య అన్న తన పేరు నచ్చక ప్రాథమిక పాఠశాలలో చేరేప్పుడే స్వంతంగా "రామోజీ రావు" అన్న పేరును సృష్టించుకుని తానే పెట్టుకున్నాడు. రామోజీరావు 1947లో గుడివాడలో పురపాలకోన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేరాడు. 1957లో ఆరవ ఫారం అక్కడే పూర్తిచేసుకుని గుడివాడ కళాశాలలో ఇంటర్, బీఎస్సీ చదివారు. 1961 ఆగస్టు 19న రామోజీరావుకు పెనమలూరుకు చెంది న తాతినేని వెంకటసుబ్బయ్య, వాణీదేవిల రెండవ కుమార్తె రమాదేవితో వివాహం జరిగింది. రమాదేవి అసలు పేరు రమణమ్మ. పెద్దలు పెట్టిన పేరు నచ్చక అలా మార్చుకుంది. రామోజీరావుతో భార్య వైపు బంధువుల్లో చిన్న బావ మరిది తాతినేని వెంకట కృష్ణారావు మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థలో డైరెక్టరుగా, తోడల్లుడు ముసునూరు అప్పారావు ఈనాడు, డాల్ఫిన్స్ హోటల్స్ మాజీ ఎండీగా కలిసి పనిచేశారు.

### శ్రద్ధాంజలి

వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి భారతదేశం లోనే ఎక్కడ లేని విధంగా ఫిలిం స్టూడియోను ఏర్పాటు చేసి తనదైన గుర్తింపు తెచ్చుకుని, జర్నలిజంలో ప్రజలను చైతన్యపరిచి, ఉదయాన్నే ఈనాడు పేపర్‌తో ప్రజలను పలకరించి అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న స్వర్గీయ చెరుకూరి రామోజీ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

**ఓం శాంతి..**


**- మల్లిన రాధాకృష్ణ, తణుకు.**


# అస్తమించిన అక్షర సూరీడు!


(మొదటిపేజీ తరువాయి..)

అంటిపెట్టుకున్న మీడియా మొఘల్ ఆయన. ఈనాడులో పనిచేయడమంటే జర్నలిస్టులకు అదో ప్రతిష్ఠ. ప్రజల పాశం తీసే ప్రభుత్వాలకు, ఆయన ఊపిరిపోసిన 'ఈనాడు' యమపాశమే. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను నిర్మొహమాటంగా చెర్నాకోల్‌తో వీపు వాతలుపడేలా చీల్చి చెండాటడం ఈనాడు బాధ్యత-ఇంకా చెప్పాలంటే సామాజికమాధ్యతగా మార్చారు.

రామోజీ స్వతహాగా జర్నలిస్టు కాదు. కానీ ఎంతోమందిని గర్వించదగ్గ జర్నలిస్టులుగా సానబట్టిన పాత్రికేయ యజమాని. ఆయన కాంపౌండ్‌లో పుట్టిన ఎన్నో మొక్కలు, పాత్రికేయ వనంలో మహావృక్షాలుగా ఎదిగాయి. పనిమంతులకు పట్టం కట్టే రామోజీ అమ్ములపొదిలో వినమ్రంగా ఒదిగిన పాత్రికేయ అర్జునులెందరో. వ్యక్తిగత ఆరాధన, వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించే ఆయన, చివరి వరకూ అదే సిద్ధాంతంతో బతికారు. ప్రజాస్వామ్యం కూలకుండా, తన ఈనాడుతో నిలబెట్టేందుకు అవిశ్రాంతంగా పోరాడుతున్న ఆ పాత్రికేయ శిఖరం ఒరిగిపోవడం ప్రజాస్వామ్యపిపాసులకు వేదనే. నేడు అక్షరం








గాయపడ్డరోజు. అక్షర శిఖరం నేలకూలిన రోజు. వేలాదిమంది అక్షరసైనికులు తమ 'మార్గదర్శి'ని కోల్పోయిన రోజు. అక్షరం మోర ఎత్తి జీవించినంత కాలం రామోజీ చిరంజీవిగానే ఉంటారు. తెలుగు జర్నలిజం సత్తాను ఢిల్లీబాదుషాలకు చాటిన చెరుకూరి రామోజీ చిరస్మరణీయుడు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
3
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 09, జూన్ 2024





# అస్తమించిన అక్షర సూరీడు

## పుడమి పుత్రుడు రామోజీరావు

(బి.రాములు)

పుడమి పుత్రుల్లో ఒకరు రామోజీరావు
ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే
ఆయన మంచితనానికి ఉదాహరణ ఇదొక్కటి చాలు..
సారా ఉద్యమం శ్రీకారం చుట్టి సత్యసాయి నిగామమం శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్) సభలో ఆయన ప్రసంగం కోట్లాది బాధితుల కుటుంబాలలో, మహిళలలో ఉద్యమ స్ఫూర్తిని నింపింది




Newstoday
PRIVATE LIMITED
EENADU COMPOUND, SOMAJIGUDA, HYDERABAD-500 482. PHONE: 229483

Date:- 30.4.91

Dear Mr. B Ramulu

Further to the written test you had with us, please make it convenient to call on us

On - 7.5.91
At - 3.00 P.M.
Place - Eenadu Compound, Somajiguda, Hyderabad - 500 482.

for Interview. You are requested to fill in the Standard Application form (Enclosed) and bring it alongwith you to the Interview. You should bring all your Certificates in support of your Qualifications and experience and also one recent passport size photograph.

A. No T.A will be paid for attending the Interview.

B. You will be paid 2nd class to and fro Rail/Bus fare by the shortest route for attending the Interview.

Sincerely,

for Newstoday Private Limited,

V.Nagaiah Choudary,
Assistant Personnel Officer.

ఈనాడులో పనిచేయడం గర్వంగా ఉంది. ఆయన రెడ్ స్కెచ్ గుడ్ ప్రశంశలు అందుకున్న వారిలో నేను ఒకరిని..

## భారత దేశపు 'రూపర్ట్ మర్డోక్' రామోజీ రావు

(వెంకట్)

రామోజీ రావు మీడియా ప్రపంచంలో పరిచయం అక్కర్లేని పేరు. భారత దేశపు 'రూపర్ట్ మర్డోక్'గా పేరు గాంచిన చెరుకూరి రామోజీ రావు(87) వ్యాపార వేత్తగా, మీడియా బారన్‌గా ప్రసిద్ధి చెందారు.

అయితే, తాజాగా రామోజీ మృతి చెందిన నేపథ్యంలో ఆయనకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

1936 నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా లోని ఓ మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన రామోజీ అంచెలంచెలుగా ఎదిగారు. తన చదువు పూర్తయ్యాక పూర్తిగా రైతులపై ఆధారపడిన పత్రికను ప్రచురించాలని రామోజీ నిర్ణయించుకుని విశాఖపట్నం నుంచి ఈ పత్రిక ప్రచురణను ప్రారంభించారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని రైతులకు అందించేది. అప్పట్లో ఈ పత్రిక బాగా ప్రాచుర్యం పొందింది.

### పత్రిక నుంచి మొదలై..


ఆ తర్వాత పత్రిక నుంచి వచ్చిన విపరీతమైన ఆదరణ తర్వాత రామోజీ సినిమా నిర్మాణం వైపు మళ్లారు. 1983లో ఉషాకిరణ్ మూవీస్ ప్రొడక్షన్ హౌస్‌ని స్థాపించారు. దీని ఆధ్వర్యంలో అనేక తెలుగు చిత్రాలను నిర్మించారు. ఈ బ్యానర్‌లో తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, బెంగాలీ సహా 80కి పైగా విభిన్న భాషల్లో సినిమాలు నిర్మించారు.

### రామోజీ ఫిల్మ్ సిటీ..

రామోజీ ఫిల్మ్ సిటీ ప్రపంచం లోనే అతి పెద్ద ఫిల్మ్ స్టూడియో కాంప్లెక్స్‌గా పరిగణించబడుతుంది. ఇది తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు 25 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ స్టూడియో 2000 ఎకరాల కంటే ఎక్కువ (8.2 చదరపు కిలో మీటర్లు) విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ స్టూడియోలో 50 షూటింగ్ అంతస్తులు ఉన్నాయి. ఈ స్టూడియో 1996లో ప్రారంభమైంది. ఇక్కడ ఏక కాలంలో 15 నుంచి 25 చిత్రాలను చిత్రీకరించవచ్చు. సినిమా ప్రీ ప్రొడక్షన్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకు అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. సినిమాలే కాకుండా, ఇది గొప్ప పర్యాటక ప్రదేశం. ప్రతి ఏటా దేశం, ప్రపంచం నలుమూలల నుంచి 10 లక్షల మందికి పైగా పర్యాటకులు వస్తారు.

### ప్రాంతీయ ఛానెళ్ల రారాజు..

భారత దేశంలో ప్రాంతీయ ఛానెల్ లను ప్రారంభించిన మొదటి వ్యక్తి రామోజీ. నేడు దేశం లోని దాదాపు ప్రతి రాష్ట్రంలో వార్తలను ప్రసారం చేస్తున్నారు. ఈనాడు, ఈటీవీ, ఈటీవీ భారత్ మొబైల్ అప్లికేషన్ సహా తెలుగు టెలివిజన్ పరిశ్రమలో ఈటీవీ మంచి నెట్ వర్క్‌ను కల్గి ఉంది. దీంతో



పాటు జర్నలిజం స్కూల్ కేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రత్యేక స్థానాన్ని రామోజీ సంపాదించుకున్నారు.

### అవార్డులు..

మీడియా, జర్నలిజం ప్రపంచానికి ఆయన చేసిన విశేష కృషికి గాను 2016లో ఆయనకు భారత దేశపు రెండో అత్యున్నత పౌర పురస్కారం కూడా లభించింది. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పద్మ విభూషణ్‌తో సత్కరించారు. దీనికి ముందు 1985లో ఫిల్మ్ ఫేర్ ఉత్తమ చలన చిత్ర పురస్కారం (తెలుగు), 1998లో ఫిల్మ్ ఫేర్ ప్రత్యేక అవార్డు, 2000లో ఫిల్మ్ ఫేర్ ఉత్తమ చలన చిత్ర పురస్కారం (తెలుగు), జాతీయ చలన చిత్ర పురస్కారం (నిర్మాత), 2004లో ఫిల్మ్ ఫేర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు లభించాయి.

### ఆపన్న హస్తం..

కరోనా మహమ్మారి సమయంలో 2020లో కష్ట సమయంలో రామోజీ రావు కోవిడ్ రిలీఫ్ కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల రిలీఫ్ ఫండ్‌కు రూ. 10 కోట్లు విరాళంగా ఇచ్చారు. అంతే కాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల పునరావాసం అనేక పనులు చేయించారు. దీంతో పాటు అనేక పనుల కోసం విరాళాలు అందించారు.

### సింపుల్ వ్యక్తిత్వం..

రామోజీ చాలా వరకు తెల్లటి హాఫ్ స్లీవ్ షర్ట్, తెల్లటి ప్యాంటు, తెల్లటి షూ వేసుకుంటారు. ఏదైనా పార్టీలు మినహా దాదాపు ఎక్కువగా వీటినే ధరిస్తారు. దాదాపు 12 టీవీ ఛానల్స్, తెలుగు దిన పత్రిక యజమాని అయిన రామోజీ రావు మొదటి చూపులో చాలా మామూలుగా కనిపిస్తారు.




## విజయానికి ఎమోజీ.. రామోజీ..!

(వెంకట్)

స్కూల్లో అక్షరాలు నేర్చుకుంటున్నప్పుడే ఈనాడులో అక్షరాలు చదవడం మొదలు పెట్టి ఉంటానేమో.. ఈనాడు దిన పత్రికలో శీర్షికల రూపంలో ఉండే పెద్ద అక్షరాలలో ఆఆఇఈలు వెతికి గుర్తు పట్టేవి కళ్ళు..
ఈ అయితే కొట్టొచ్చినట్టు పేరులోనే కనిపించిన శిఖరాక్షరం..

కాస్త అక్షర జ్ఞానం పెరిగేటప్పటికి అదే ఈనాడులో మాటలు..

వాక్యాలు.. సినిమా బొమ్మలు.. గవాస్కర్.. గుండప్ప విశ్వనాథ్ ఫోటోలు.. ఇలా ఆ పత్రికలో ప్రతి అంశం ఒక బాల శిక్షలా.. రేపటి నా జర్నలిజానికి అదే శిక్షణలా..

రోజులు గడిచాయి.. క్యాలండర్లు మారాయి.. ఈనాడులో సంచిక.. సంపుటిలు తిరగ బడుతూనే ఉన్నాయి. ఆ పత్రికపై ఆసక్తి పెరుగుతూనే ఉంది..

అక్షరాలు ఏరుకుని చదివే దశ నుంచి పుటలు.. పేరాలు..

పేజీలు తిప్పుతూ నెమ్మదిగా ఈనాడు చదవడం అనేది ఒక వ్యసనంగా మారింది.

అర్థం కాని రోజుల నుంచి.. అర్థాలు వెతుకుతూ.. అనర్థాల గురించి తెలుసుకుంటూ..

అంతరార్థాలు తెలుసుకుంటూ..

చాలా పెద్ద ప్రయాణం ఈనాడుతో.. ప్రతి నాడు..!

పేపర్ వస్తే చూడ్డం మొదలుకుని.. పేపర్ అందుకోవడం వరకు.. రోజూ ఎదురు చూడ్డం దాకా.. రాకపోతే వెళ్లి తెచ్చుకునే దశ.. అలా చదువుతూ ఎప్పటికైనా మనమూ ఒక జర్నలిస్టు అయితే.. అన్న ఆశ..!

జీవితంలో ఇంకొన్ని పేజీలు తిరిగాయి.. ఈనాడులో వార్తలు చదివి.. అవగాహన చేసుకుని.. జిజ్ఞాస పెంచుకుని.. ఆ పత్రికలో వచ్చిన హెడ్డింగులకు

ప్రత్యామ్నాయంగా హెడ్డింగులు.. ఆ పక్కనే రాసి.. మనదే వాసి అనే చిన్న లెవెల్.. అప్పటికి మన బుర్ర ఈనాడుకు పేర్లల్.. ఓ భ్రమ.. అయినా భవిష్యత్తు అక్కడే నిర్మాణమై నెరవేరిన ఓ కల.. ఆ పత్రిక ద్వారానే అబ్బిన రాయడం అనే ఓ కళ..!

ఊహ తెలిసాక.. పత్రికా రంగ ప్రముఖుల్లో మొదటగా తెలుసుకున్న ఇద్దరు వ్యక్తులు.. ఇండియన్ ఎక్స్ప్రెస్ గ్రూపు సంస్థల చైర్మన్ రామనాథ్ గోయెంకా.. ఈనాడు అధినేత రామోజీ రావు.. జాతీయ నాయకుల్లో గాంధీ.. నెహ్రూ బొమ్మల్లా.. చిత్ర పరిశ్రమలో ఎన్టీఆర్.. ఏయెన్నార్ పేర్లలా.. గోయెంకా.. రామోజీ రావు.. ఈ పేర్లు హృదయ ఫలకంపై ముద్రించుకు పోయాయి..!



38 సంవత్సరాల క్రితం...
50 ఏళ్ళ వయసులో
తన సతీమణితో రామోజీ రావు

ఈనాడు ప్రస్థానం..
రామోజీ రావు
దిగ్విజయ యాత్ర..
పత్రిక గెలుపులు..
దాని మలుపులు..
నలుపు తెలుపులు..
సంచలన మెరుపులు..
రంగుల తళుకులు..

సంపాదకీయ చెణుకులు.. ఎడిట్ పేజీ ఆర్టికల్ విశ్లేషణలు.. కార్టూన్ బాంబులు.. కొన్ని పాలక పక్ష రుబాబులు.. మొక్కవోని ధైర్యంతో

పెద్దాయన జవాబులు.. ఎమర్జెన్సీ రోజుల నాటి సవాళ్లు.. దుర్మార్గపు పాలనను ఎదిరించిన రుధిరాక్షరాల ఆనవాళ్లు.. 1982లో తెలుగు విభవుడు నందమూరి తారక రామారావు రాజకీయ ఆగమన వేళ సాగిన సంచలన ప్రచార హేల.. చెప్పుకుంటూ పోతే ఈనాడు లేని దెక్కడ.. రామోజీ రానిదెప్పుడు..

ఎన్ని ఆలోచనలు.. తొలి పేజీలో కార్టూన్ మొదలు.. బ్యానర్.. ఓ సంచలన వార్త.. ఈనాడు ఆదివారంలో సమరం దుమారం..

హోమియో పావులూరి.. ఆసక్తి పెంచిన పజిల్..

చిన్న పేపర్లు.. ఎన్ని ట్రెండ్లు.. పేలుతూ ఉన్నా అప్పుడప్పుడు
వ్యతిరేక గుండ్లు..!
రామోజీ..
అక్షరం కాని శిలాక్షరం..

పత్రికా రంగంలో ఉన్నత సింహాసనం.. ప్రత్యక్షం గానో.. పరోక్షంగానో రాజకీయం లోనూ శాసనం.. జగం మెచ్చిన మేరు నగం.. జాతీయ పత్రికా రంగంలో ఆయనే సగం..

వ్యక్తి.. శక్తి.. యుక్తి.. దీయుక్తి..
రాతగాడికి..
ఆటగాడికి..
పాటగాడికి..
వార్తల వేటగాడికి..
నటుడికి..
రచయితకి..
దర్శకుడికి..
మొత్తంగా కళకి..
కళాకారుడికి..
ఆయన పెద్ద దిక్కు.
అద్భుతం ఆయన దృక్కు.


నిజానికి ఆయనే 88×365 పేజీల అతి పెద్ద బుక్కు.. తెలుగు జర్నలిజానికి వేద వాక్కు..! ■

# పెళ్లి రోజు..రామోజీ హాజరైన వేళ..

(ఎం.వి.ఆర్.శాస్త్రి)

"ఏమిటి ఏమ్వీఆర్ ఈ వేళ వచ్చావ్ " అన్నారు రామోజీరావు గారు ఒకింత ఆశ్చర్యంగా.

ఆదివారం సెలవు. సాధారణంగా ఆయనని డిస్టర్బ్



చేయము. అతిముఖ్యమైన పని ఉంటే తప్ప. అందునా ఇంటికి వెళ్లి.

"నా పెళ్లి కుదిరిందండి " అన్నాను కొంచెం బిడియంగా.

"అవునా ! కంగ్రాట్స్ . వెరీ గుడ్. మంచి కబురు చెప్పావు. ఎప్పుడు పెళ్లి ? "

"అది మాట్లాడటానికే ఇప్పుడు వచ్చానండి. వచ్చే నెల మీకు ఎప్పుడు ఖాళీ ఉంటే దానికి తగ్గట్టు ముహూర్తం పెట్టిస్తా . మీరు రావటం నాకు అన్నిటికంటే ఇంపార్టెంటు " అన్నాను.

"మీకు నచ్చిన ముహూర్తం ఏ రోజైనా సరే పెట్టించుకో . అది ఏ రోజైనా నాకు ఎన్నిపనులున్నా మానుకుని వస్తా " అని హామీ ఇచ్చారు 'చైర్మన్ గారు '.

హైదరాబాద్ లో చిక్కడపల్లిలోని కోనసీమ ద్రావిడ సంఘం హాల్ లో 1983 మార్చ్ 24 ఉదయం 9-30 కి నా పెళ్లి . దానికి వారం ముందే నన్ను పిలిచి 2500 రూపాయలు కాష్ గిఫ్ట్ ఇచ్చారు రామోజీరావు గారు. అప్పట్లో అది చాలా పెద్ద మొత్తం. నాకు రెండు నెలల జీతం తో సమానం. హనీమూన్ ఖర్చంతా దానితోనే వెళ్ళిపోయింది.

పెళ్లి హాల్ చాలా చిన్నది. నిండా 150 కుర్చీలు పట్టవు. గెస్ట్ లు అందరికంటే ముందు 8- 45 కల్లా శ్రీమతి రమాదేవి గారితో కలిసి వచ్చారు రామోజీ రావు గారు. అప్పటికింకా కన్యాదానం తతంగం మొదలే కాలేదు. ఆ సందర్భంలో తీసిందే ఈ ఫోటో.



ఈనాడులో నాకు చాలా ఆప్తులైన వారిలో ముఖ్యులు రాంభట్ల కృష్ణమూర్తి గారు. నేను 1978 ఫిబ్రవరి లో చేరేసరికి ఆయన ఎడిటర్ ( అడ్మినిస్ట్రేషన్ ఊ గా ఉండేవారు. ఈనాడు లో చేరక ముందు నుంచే కమ్యూనిస్ట్ పార్టీ లో ఆయన నాకు చాల ఏళ్ళుగా తెలుసు. అరసం లో పాత కామ్రేడే . ఈనాడులో నేను చేరటం లో ఆయన ప్రమేయం లేదు. చేరబోతున్నట్టు కూడా ఆయనకు తెలియదు. కానీ చేరాక బాగా దగ్గరయ్యాం. నా పెళ్లి నాటికి ఆయన ఈనాడులో మానేసినట్టు గుర్తు.

నేను తప్పనిసరిగా ఇంటికి వెళ్లి ఆహ్వానించి పెళ్ళికి పిలవవలిసిన అతిముఖ్యులలో రాంభట్ల ఒకరు. కాని అప్పటి పని వొత్తిడిలో మరిచిపోయాను. ఆ సంగతి తీరా పెళ్లి రోజు గానీ గుర్తు రాలేదు.అయ్యో పెద్ద తప్పయిపోయింది . తెలిస్తే ఆయన ఏమనుకుంటారో అని బాగా ఫీల్ అయ్యాను. ఆ సంగతి పెళ్లి మంటపం లో నా సహచరులతో అంటూండగానే ప్లెజంట్ సర్ప్రైస్ !

రాంభట్లగారు వచ్చారు. " ఏమి శాస్తుర్లూ ! నీ పెళ్ళికి నువ్వు పిలిచేదేమిటి ! ఇందాకే తెలిసింది ! వెంటనే వచ్చేశాను " అన్నారు నిండు మనసుతో నన్ను నోరైనా ఎత్తనివ్వకుండా ! "

దటీజ్ రాంభట్ల ! రియల్లీ ఎ గ్రేట్ మాన్ ! ఆయన వచ్చిన ఆనందంలో తీసుకున్నది ఈ కింది ఫోటో .

అప్పట్లో సిగరెట్లు బాగా కాల్చేవాడిని. అలవాటు ప్రకారం అప్పుడూ చేతిలో సిగరెట్ ఉంది. మా పక్కన ఉన్నవారిలో అప్పటి న్యూస్ టుడే డైరెక్టర్ ఎస్.ఆర్.రామానుజన్ గారు, సీనియర్ ఎక్జిక్యూటివ్ డి.పి.వర్మ, సబ్ ఎడిటర్ పళ్ళంరాజు , బందా గాంధీ, నా బాల్యమిత్రుడు పి.వి.

ఎం.ఎల్.నరసింహా రావు ఉన్నారు. అప్పటికి నేను ఈనాడు లో చీఫ్ సబ్ ఎడిటర్‌ని.

ఆ నాటి పెళ్ళి ఫోటో ఇది :



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
4
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 09, జూన్ 2024



# అస్తమించిన అక్షర సూరీడు


## రామోజీరావు మృతిపట్ల
# టీడీ జనార్థన్ దిగ్భ్రాంతి



పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్రవేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేసిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్థన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారన్నారు. ఈనాడు పత్రిక స్థాపన ద్వారా మీడియా రంగంలో నూతన్య అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. రామోజీరావు మృతి తెలుగువారికి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# అక్షర దళపతికి అశ్రు నివాళి

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్క



ఆనంద్ బాబు, బోండా ఉమామహేశ్వరరావు, శాసనమండలి సభ్యులు పర్చూరి అశోక్ బాబు, దువ్వారపు రామారావు, శాసనసభ్యులు కొండ్రు మురళి, దాట్ల సుబ్బరాజు, ఎమ్మెస్ రాజు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మరియు పార్టీ నాయకులు లింగారెడ్డి, ఏవి రమణ, దారనాయక్,ఆనంద్ సూర్యా,అఖిల్, హసన్ భాష, కృష్ణ, బుచ్చి రాంప్రసాద్,శంకర్ నాయుడు పార్టీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు

# ప్రజా పక్షపాతి రామోజీరావు

**- శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు**



ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు స్వయం కృషి తో అత్యంత ఉన్నత స్థితి కి చేరి తెలుగు వారి చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్నారు. రామోజీరావు ఈ రోజు అంతిమ శ్వాస విడవడం అత్యంత విచారకరం.

ఈనాడు పత్రికతో ప్రస్థానం ప్రారంభించిన ఆయన తెలుగు పత్రికారంగానికి దశాబ్దాలుగా ఎనలేని సేవలందించారు. ప్రజా పక్షపాతిగా, , జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పనిచేసారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమస్ఫూర్తితో పని చేశారు.

అలుపెరుగని అక్షర యోధుడికి కన్నీటి నివాళులు అర్పిస్తూ..వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. రామోజీరావు కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

## అలుపెరుగని కృషీవలుడు
# రామోజీ రావు

**- తెదేపా జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి**

అలుపెరగని కృషి, పట్టుదల, అంకితభావం, ధృడదీక్ష, పోరాటపటిమ, ప్రజాస్వామ్య పరిరక్షణలకు రామోజీరావు పర్యాయపదం. వేలాదిమందికి ఉపాధి కల్పించిన కల్పవృక్షం. తెలుగుభాష అభ్యున్నతికి ఎంతోగానో కృషిచేశారు. పాడుతా–తీయగా లాంటి కార్యక్రమాలతో ఎంతోమంది మట్టిలో మాణిక్యాలను వెలితీశారు. ప్రపంచంలోనే రెండవ స్థాయి కలిగిన ఫిల్మ్ సిటీని నిర్మించారు. మార్గదర్శి ద్వారా లక్షలాది మంది ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందించారు. అక్షరాస్యత ఉద్యమానికి ఈనాడు ఎంతగానో తోడ్పడింది. వ్యాపారంలో సమాజహితం చేసిన మహోన్నత వ్యక్తి.



రామోజీ జీవితం భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలి. రామోజీ రావు స్మృతికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించాలి. రామోజీ రావు గారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

# రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు

**- జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకుల బాలస్వామి**



తెలుగుతోపాటు దేశంలోని మరెన్నో భాషల్లో మీడియా రంగం ద్వారా ప్రజలకు సేవలు అందించిన ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతి దేశంలోని మీడియా రంగానికి తీరని లోటు అని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకుల బాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ , భాగ్యనగర్ నగర అధ్యక్షులు అఖిలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రింట్ తో పాటు ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో కూడా జాతీయస్థాయిలో రామోజీరావు (ఈనాడు) అందించిన సేవలు చిరస్మరణీయమని గుర్తు చేశారు. ఈనాడు జర్నలిజం స్కూల్‌తో పాటు ఇతర రంగాల ద్వారా వేలాది మందిని జర్నలిస్టులుగా తీర్చిదిద్దిన ఘనత రామోజీరావు గారిదే అని ప్రశంసించారు. ఎంతటి విపత్తునైనా ఎదుర్కొని నిక్కచ్చి గల వార్తలతో నిలబడ్డ అసాధ్యుడు రామోజీరావు అన్నారు.

అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని అక్షర సమరంతోనే విజయం సాధించిన మహనీయుడు అని వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు మీడియా రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ.. తరతరాలకు చిరస్మరణీయ జర్నలిజం సంబంధించిన ఆ మహానుభావుడికి శ్రద్ధాంజలి ఘటిస్తూ.. నివాళి అర్పిస్తున్నామని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది.

## సామాజిక బాధ్యత స్ఫూర్తి ప్రదాత
# తెలుగుజాతి ముద్దుబిడ్డ రామోజీరావు

**-మాజీ ఎంపీ కంభంపాటి రామమోహన్ సంతాపం**

“అతనొక నమ్మకం, అతనొక నిజాయితీ, అతనొక గెలుపు, అతనొక బాధ్యత, అతనొక స్ఫూర్తి, అతనొక అద్భుతం”..

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు పరమపదించడం తెలుగుజాతికే కాదు, మొత్తం సమాజానికే తీరనిలోటు..ఏఅతి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగిన మేరునగధీరుడు రామోజీరావు..

60ఏళ్లుగా మార్గదర్శి, 50ఏళ్లుగా ఈనాడు, 40ఏళ్లుగా సినిమా నిర్మాణం, 30ఏళ్లుగా ఈ టీవీ, ఫిల్మ్ సిటీ, అనేక సంస్థలను విజయవంతంగా నిర్వహిస్తూ వేలాదిమందికి ఉపాధినిచ్చి, లక్షలాదిమందికి బతుకు తెరువు కల్పించి, కోట్లాది ప్రజల అభిమానాన్ని చూరగొన్న తెలుగుజాతి దిగ్గజం రామోజీరావు..

తానెంత అత్యున్నత స్థానానికి చేరినా తనమూలాలు మర్చిపోని నిరాడంబరుడు..సామాజిక బాధ్యతకు మారుపేరు..విపత్తుల్లో బాధితులకు అండగా నిలబడ్డ



వదాన్యుడు, తాను భూరి విరాళాలివ్వడమే కాకుండా, తన సంస్థలతో విరాళాలు సేకరించి విపత్తు బాధితులకు పక్కాగృహాలుగా అన్నివసతులతో “సూర్య” భవనాలు నిర్మించి ఆదుకున్న ధన్యజీవి..

తెలుగు సంస్కృతీ వికాసం, తెలుగుభాషాభివృద్ధికి పాటుబడ్డ తెలుగుజాతి ముద్దుబిడ్డ.. సామాజిక బాధ్యత స్ఫూర్తిప్రదాత రామోజీరావు లేని లోటు నాకు వ్యక్తిగతంగా తీరనిది.

రామోజీరావుగారి కుటుంబ సభ్యులకు, ఈనాడు–ఈటీవీ, మార్గదర్శి, ఇతర సంస్థల ఉద్యోగులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను.

# అక్షర యోధునికి నివాళి

**రామోజీరావు మరణం తీవ్రంగా కలచివేసింది**


**ప్రజాస్వామ్యం కోసం తపించిన తీరు ఆదర్శప్రాయం**

**పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు**

నిజాలను ప్రజలకు చేరవేయాలి, ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేసేలా ఉండాలని తపించే ఏకైక వ్యక్తి చెరుకూరి రామోజీరావు మరణం అత్యంత బాధాకరం. ఎక్కడో చిన్న రైతు కుటుంబంలో పుట్టి అచంచలమైన కష్టంతో ప్రపంచం మెచ్చే వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన తీరు అనితర సాధ్యం. ఎన్నో ఆటుపోట్లు.. మరెన్నో అవమానాలు అన్నింటినీ ఎదురొడ్డి, రామోజీ రావు ఈ స్థాయికి చేరారు. వాస్తవాలు మాత్రమే ప్రజలకు తెలియాలని ఈనాడు అనే మీడియా వ్యవస్థను స్థాపించి.. ప్రజలకు తోడుగా నిలిచారు.

మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి లాంటి ఎన్నో వ్యాపార సంస్థల్ని స్థాపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేశారు.

అతి తక్కువ సమయంలోనే జాతీయస్థాయి నెట్



వర్క్‌గా ఈటీవీని విస్తరించారు. తెలుగు నాట ఎన్ని వార్తా పత్రికలొచ్చినా, ఎన్ని టీవీ ఛానళ్లు వచ్చినా.. నిజ నిర్ధారణ కోసం చూసే ఏకైక న్యూస్ నెట్‌వర్క్‌గా ఈనాడు, ఈటీవీని రూపుదిద్దారు. రామోజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం. ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటు.

# శిఖర సమానుడు, అక్షరయోధుడు రామోజీరావు

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, అక్షరయోధుడు చెరుకూరి రామోజీరావు గారి మహాభినిష్క్రమణం నన్ను ఎంతో ఆవేదనకు, బాధకు గురి చేసింది. వ్యక్తిగతంగా ఆయనకు ఎంతో సాన్నిహిత్యం ఉంది. రామోజీరావు గారు తెలుగు సమాజానికి, దేశానికి చేసిన సేవలు విస్తృతం, అనన్య సామాన్యం. ఓ దశలో రాష్ట్రంలో రాజకీయ విలువలు పతనం అవుతున్న దశలో రామోజీరావు గారు సాగించిన అక్షర యజ్ఞం, రాజీలేని పోరాటం తెలుగునాట అక్రమార్కులు తోక ముడిచేలా చేసింది. ప్రజాస్వామ్య పునాదుల్ని పటిష్టం చేశాయి.

రామోజీరావు గారు తన సంస్థల ద్వారా, ప్రత్యేకించి జర్నలిజంలో నెలకొల్పిన ప్రమాణాలు అత్యున్నతమైనది. తెలుగు భాషకు, తెలుగు సినిమాకు ఆయన చేసిన సేవలు తెలుగునాట ఎప్పటికీ గుర్తుండి పోతాయి. తెలుగువారి చరిత్రలో తనకంటూ రామోజీరావు ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకొని వెళ్లిపోయారు. ఆయన నమ్మిన విలువలు, నమ్మకాలను ఆచరించడమే



ఆయనకు అందించే ఘనమైన నివాళి కాగలదు. రామోజీరావు గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను.

**- సి. రామచంద్రయ్య, మాజీ శాసనమండలి సభ్యులు**



# ఈనాడు ...చైతన్యం

మార్గదర్శి ....ఆర్థిక పొదుపు !
అన్నదాత ...పట్టెడన్నం !
ఈనాడు ...చైతన్యం !
ఈ టి వి...ఎంటర్టైన్మెంట్ !
ఫిల్మ్ సిటీ ..హనీమూన్ !!

పట్టు పట్టాడంటే ... విక్రమార్కుడే !
పచ్చ. .పచ్చ ..పచ్చ....
అన్న వె ధ వల్ని మట్టికరిపించి
నింగి కెగసిన విజేత !!!
రామోజీ రావు గారి దివ్యాత్మకు
శాంతి కలగాలని కోరుకుంటూ...,
వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ

**- జి వి రామ్ ప్రసాద్**
**విజయవాడ**

## రామోజీరావుకి
# అశ్రునివాళి

**- బాలకృష్ణ**

తెలుగు పత్రికా రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందారు రామోజీ రావు. తెలుగులోనే కాదు దేశ పత్రికా రంగంలోనే ఓ కొత్త ఒరవడిని సృష్టించి భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శి గా నిలిచారు. తెలుగు నుడికారానికి ఒక కొత్త కళను తెచ్చారు. జర్నలిజానికి కొత్త సొబగును దిద్దారు. చిత్ర సీమలో అదే తీరున సాగి ఉషోదయ కిరణాలను ప్రసరింప చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడియోగా రామోజీ ఫిలిం సిటీని తెలుగు నేలపై నెలకొల్పారు. ఏది చేసినా తనదైన బాణీ కల్పిస్తూ సాగిన రామోజీరావు ఇక లేరు అన్న వార్త ఆవేదన కలిగిస్తోంది. మా తండ్రిగారు నందమూరి తారక రామారావు గారితో ఆయన అనుబంధం ప్రత్యేకమైనది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ., ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.



ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన అవనిగడ్డ ఎమ్మెల్యే డా.మండలి బుద్ధప్రసాద్

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 09, జూన్ 2024






## తెలుగు మాగాణపు ధృవతార, కీర్తి పతాక!

### "చెరుకూరి రామోజీరావు" పత్రికా రంగంలో తిరుగులేని ప్రభంజనం!

తెలుగు భాష వైభవం, అక్షర సాగుదారుడు,సమాజ హితైషి, తన ప్రచురణల ద్వారా పాత్రికేయ రంగంలో నూతన ఒరవడి సృష్టించి,విలువల్ని స్థాపించి పత్రికారంగంలో ఆదర్శప్రాయంగా నిలిచి తెలుగు జాతి గర్వకారణంగా వెలుగొందారు.

సంక్షోభ సమయంలో జాతిని జాగృతం చేసి సమస్యని పరిష్కారం చేసే అద్భుతమైన వైద్యుడు రామోజీరావు గారు!
ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి పేరు బాగుంటుంది పెట్టమని బుద్ధ భగవానుడు నడయాడిన నేల,దేవతల రాజధాని, ఒకప్పుడు చారిత్రకంగా ఉన్నతంగా వర్ధిల్లిన ప్రాంతం శుభకరంగా ఉంటుందని చంద్రబాబు గారికి సూచించి తెలుగు జాతి పట్ల తన మమకారాన్ని చాటుకున్న మహామనీషి మన రామోజీరావు గారు.
తెలుగుజాతి ఏమిచ్చినా ఆయన ఋణం తీర్చుకోలేనిది.ఆయన లేరన్న మాట వింటే హృదయం బరువెక్కి మాట పూడుకుపోయింది.
మళ్లీ జన్మంటూ ఉంటే భవిష్యత్తు తరాల బాగు కోసం, జాతి చైతన్యం కోసం రామోజీ గానే పుట్టాలని భగవంతుని ప్రార్థిస్తూ మీ ఆత్మకి శాంతి చేకూరాలని వైకుంఠ వాసంలో విష్ణుమూర్తి సన్నిధిలో



మీరు సంతోషంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీ కుటుంబ సభ్యులకి నా ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటూ మీరు పునర్జన్మ పొందాలని కోరుకుంటూ అశ్రు నివాళులతో...

**- రమాదేవి గంగవరపు!**

## రామోజీరావు మరణం బాధాకరం

**- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి**

తెలుగు రాష్ట్రాల్లో రామోజీరావు గారు అంటే తెలియని వారెవరు లేరు వారు క్రమశిక్షణ సమయపాలన వారికుండే జ్ఞానం అమోఘం వారు సామాన్యంగా జీవితం ప్రారంభించి అంచలంచలుగా ఎదిగారు ఈటీవీ, ఈనాడు ,అనే సంస్థలు నిర్మించి వేలాదిమంది యువతకు ఉపాధి కల్పించారు నేటి యువతరం వారిని ఆదర్శప్రాయంగా తీసుకోవాలి అన్నారు. వారి మరణ వార్త చాలా విషాదకరం వారి ఆత్మకు శాంతి కలగాలని అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నాను.



రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు పార్థీవదేహానికి నివాళులర్పించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారు, భువనేశ్వరి

## అంచలంచెలుగా ఎదిగి అక్షర యోధుడు

### అక్షర యోధునికి అశ్రు నివాళులర్పించిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, మీడియా మొఘల్, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం పట్ల రాజమండ్రి రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు శాసన



సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసం నందు టీడీపీ నాయకులతో కార్యకర్తలతో కలిసి గోరంట్ల రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి వారికి ఘన నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ తెలుగు భాషకు రామోజీరావు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేని అని రామోజీ మృతి తెలుగు వారు అందరికీ తీరని లోటు అని గోరంట్ల భావోద్వేగమయ్యారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి ఒక అంచలంచెలుగా ఎదిగి అక్షర యోధుడుగా,ఒక మార్గదర్శిగా నిజాయితీ విలువలతో కూడిన జర్నలిజంతో తెలుగువారి గుండెల్లో ఆయన ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని అలాంటి మహా యోధుడు మన మధ్య లేక



పోవడం బాధాకరమని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి యర్ర వేణుగోపాల్ రాయుడు, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు,రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి,రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్,గంగిన హనుమంత రావు, నున్న కృష్ణ,ఆళ్ల ఆనందరావు,యార్లగడ్డ శేఖర్, సింగ్ సురేంద్ర, కోరాడ వెంకటేష్,శ్రీను,రాయుడు సునీల్,పసలపూడి పాపారావు, ఆళ్ల విఠల్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్గదర్శి

క్యాష్ చెల్లింపు రోజుల్లో ఆ సంస్థది, పావలా చిల్లర కూడా వెనక్కి ఇచ్చే "నిజాయితీ", పావలా చిల్లర కూడా వసూలు చేసే "ఖచ్చితత్వం" (అడ్వటైజ్మెంట్ ఏజెన్సీ గా 1995-99 మధ్య ఇది నా స్వానుభావం)

కొన్ని దశాబ్దాలు గా, ఖచ్చితంగా నెలాఖరునే ఉద్యోగుల జీతాలు ఇచ్చే "నిబద్ధత".

కొన్ని దశాబ్దాలుగా, కోట్ల మంది కస్టమర్లు, లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు ఉన్న ఎన్నో వ్యాపారాల్లో, ఒక్కటంటే ఒక్క కంప్లైంట్ కూడా లేని "అపార నిజాయితీ" ( నీచ రాజకీయాలు ఎంత ప్రయత్నించినా కూడా ).

కొన్ని లక్షల ఉద్యోగ, మరిన్ని లక్షల ఉపాధి తో, నిరుద్యోగ నిశీధి లో "ఉషాకిరణం".

వేల మందికి వేదిక ఇచ్చి, వందల మందికి బుల్లి మరియు వెండి తెరలపై గొప్పగా నిలిపిన ఈ"టీవి".


వ్యతిరేకించే వాళ్ళు కూడా, ఈనాడు/ఈటీవీ వార్తలు ఫాలో అయ్యేలాగ చేసిన "క్రెడిబిలిటీ".

సొంత విమానంలో తిరిగే స్థాయి ఉన్నా, చనిపోయే వరకు, కేవలం "ఇన్నోవా కారు" లో మాత్రమే తిరిగిన "అత్యంత ఉన్నతమైన సింప్లిసిటీ".

సామాన్య వ్యక్తిగా పుట్టి మహా వ్యవస్థ గా పెరిగిన "మార్గదర్శి".

ఈటీవీ/ఈనాడులో అచ్చ తెలుగు పదాల వాడుకతో తెలుగు భాష ఉన్నతి కోసం పరితపించే "ఆధునిక రాయలు".

రాష్ట్ర దేశ రాజకీయాల్ని శాసించే "ప్రజ్ఞ"
రాజకీయ ప్రత్యక్ష ప్రవేశం కోరని "స్థితప్రజ్ఞత".
ఒక గొప్ప మెమరీ....
ఆయనిచ్చిన అపాయింట్మెంట్ దాటి
20 నిముషాలు వెయిటింగ్ లో ఉంచినందుకు,



నాబోటి వాడికి కూడా ( అవును.... 10 ఏళ్ల క్రితం, భద్రం శ్రీనివాస్‌కి )

"సారీ బాబూ" అని చెప్పిన "హిమాలయ సమాన మహెూన్నత వ్యక్తిత్వం".

అందరికీ "ప్రియ" మైన
"మార్గదర్శి" అయిన
"రామోజీ" రావు గారికి
?"ఈనాడు" అర్పిస్తున్నాం
"కళాంజలి".

ఘన నివాళులతో....

**- భద్రం శ్రీనివాస్**

**9398-124-038**

**గమనిక :** ఆయన "భౌతికంగా" ఈరోజు చనిపోయారు. కానీ అలాంటి వ్యక్తికీ, వ్యవస్థకీ "కులం" రంగు పులిమిన ఒక జాతి "నైతికంగా" ఏనాడో చచ్చింది.

## దార్శనికుడు రామోజీ : మోదీ

రామోజీ గ్రూప్ చైర్మన్ రామోజీరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మోదీ రామోజీరావుకు నివాళులు ప్రకటించారు. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు రామోజీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.
ఆయన సహకారం జర్నలిజం, సినిమా ప్రపంచంలో చెరగని ముద్ర వేసిందన్నారు. రామోజీ అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా మీడియా, వినోద ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు, కొత్త ప్రమాణాలు నెలకొల్పారని వెల్లడించారు.

### చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి

ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని చంద్రబాబు అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు అన్నారు.

రామోజీరావుతో తనుకు ఉన్న 4 దశాబ్దాల అనుబంధాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు... తనను ఆయనకు ఎంతో దగ్గర చేసిందని అన్నారు. సమస్యలపై పోరాటంలో ఆయన తను ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో శ్రీరామోజీ సూచనలు, సలహాలు తాను తీసుకునేవాడినని గుర్తుచేసు కున్నారు.

### ఆవేదన కలిగించింది: వెంకయ్యనాయుడు

ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి ఆవేదన కలిగించిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అడుగు పెట్టిన ప్రతీ రంగంలోనూ ఆయన తన మార్క్‌ను చూపించారన్నారు. తెలుగు భాష, జర్నలిజానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. 88ఏళ్ల వయస్సులోనూ క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన నడుచు కునే వారని, ఆయన ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు.

### దిగ్భ్రాంతికి లోనయ్యా:పవన్ కల్యాణ్

రామోజీ రావు లేరనే వార్త ఆవేదన కలిగించిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. అక్షరయోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాన న్నారు. అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక.. కోలుకొంటారని భావించానని పవన్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనంగా మారిందని పవన్ తెలిపారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని




కలిగించారని పవన్ తెలిపారు.

### రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించారని గుర్తుచేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటిం చారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలి పారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీచేశారు.

### జగన్ అరాచకాల మనోవేదనతోనే: నట్టి కుమార్

ఈనాడు పత్రికాధినేత, ప్రముఖ నిర్మాత రామోజీరావు మృతి పట్ల తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ నట్టి కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జగన్ అరాచకాల మనోవేదనతోనే రామోజీరావు ఆరోగ్యం క్షీణించిందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

"ఇంకా ఆయన ఎంతో కాలం మన మధ్యే ఉండేవారే. కానీ ఆంధ్రప్రదేశ్‌లో 5 సంవత్సరాల పాలనలో జగన్మోహన్ రెడ్డి చేసిన అరాచకాలు, పగలకు ఆయన మనోవేదన చెందడంవల్లే ఆరోగ్యం దెబ్బతిన్నది. ఇప్పుడు ఏపీలో ఎన్నికల ఫలితాలు రాగానే అరాచకపాలన అంతమొందిన్న వార్తలను చూసుకున్న



అనంతరమే ఆయన మనఃశాంతితో తుది శ్వాస విడిచారు.

కోకొల్లల మందికి ఆయన ఆదర్శప్రాయులు, స్ఫూర్తిప్రదాత. రామోజీ ఫిలింసిటీని నిర్మించి, చిన్న సినిమాలు కూడా షూటింగ్ చేసుకునేందుకు ఎంతగానో సహకరించారు. నేను నిర్మాతగా తొలినాళ్ళలో బండ్ల గణేష్ హీరోగా తీసిన సినిమా షూటింగ్ రామోజీ ఫిలిం సిటీ లో చేయడానికి కారణం చిన్న సినిమాల పట్ల ఆయనకు ఉన్న ఆదరణ, పెద్ద మనస్సే. చిన్న సినిమాలు సైతం ఫిలింసిటీలో షూటింగ్ చేసుకోవచ్చని చాటి చెప్పారు. నేను ఫిలింఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లో ఉన్నప్పుడు ఆయన అమూల్యమైన సూచనలు, సలహాలను ఇచ్చి మార్గదర్శకులుగా నిలిచారు. కొత్త వాళ్ళతో అయినా సినిమాలు తీసి, ఎంత పెద్ద హిట్ చేయవచ్చో నిరూపించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

6

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 09, జూన్ 2024








## అలుపెరుగని అక్షర యోధుడు రామోజీరావు

**- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్**

రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటు. ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నాను. జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన రామోజీరావు మనకు మార్గదర్శి. ప్రజాస్వామ్య పరిరక్షణకు రామోజీరావు ఉద్యమస్ఫూర్తితో పని చేశారు.





రామోజీరావు పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు , విజయవాడ వెస్ట్ ఎంఎల్ఏ సుజన చౌదరి



ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్,మీడియా దిగ్గజం,అక్షర యోధుడు రామోజీరావు పార్థివ దేహానికి నివాళులర్పించిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు




రామోజీరావు పార్థివదేహానికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు

## పట్టుదల, అంకితభావానికి నిదర్శనం రామోజీరావు

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు**

**తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో ఘన నివాళి**

మంగళగిరి: టీడీపీ కేంద్ర కార్యాలయంలో రామోజీరావుకు ఘన నివాళులర్పిం చారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రామో జీరావు మృతి వ్యక్తిగతంగా చాలా కలచివేసింది. సాధారణ కుటుంబంలో పుట్టి ఒక అసామా న్యమైన వ్యక్తిగా ఎదిగి పట్టుదల, అంకితభావంతో నమ్మిన సిద్ధాం తం కోసం పనిచేశారని కొనియాడారు. సుదీర్ఘకాలంలో ఎప్పుడూ ఇబ్బంది పడలేదని, వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు పెట్టారు. అయినా నిజాలను రాసి మళ్లీ రాష్ట్రాన్ని ఒక గౌరవ ప్రదమైన రాష్ట్రంగా తీసుకురావడానికి రామో జీరావు కృషి చేశారన్నారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో రామోజీరావు పటాలు పెట్టి నివాళులర్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు. పత్రికా రంగం, సినీరంగంలో ఆయన పేరు సువర్ణాక్షరాలతో లిఖించవచ్చన్నారు. తెలుగుజాతికి ఆయన సేవలు మరువలేనివన్నారు. బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విలువ లకు పట్టంకట్టి ఈటీవీ, ఈనాడు పత్రికలను ఏర్పాటు చేసి తెలుగువారి ఖ్యాతిని దశదిశలా వ్యాపించిన రామోజీ మరణం తెలుగు జాతికి పూడ్చలేని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు,



ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, దాట్ల సుబ్బరాజు, ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు లింగారెడ్డి, ఎ.వి.రమణ, దారనాయక్, ఆనంద్ సూర్యా, అఖిల్, హసన్‌బాషా, కృష్ణ, బుచ్చి రాంప్రసాద్, వద్దులూరి వెంకటేశ్వర రావు, శంకర్ నాయుడు, పార్టీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు పాల్గొన్నారు.



రామోజీరావు లాంటి విశిష్ట వ్యక్తిని ఆరు నెలల క్రితం కలిశా అరగంట సమయం ఇచ్చి రెండు గంటలపాటు నాతో మాట్లాడారు. నా జీవితంలో ఆ రెండు గంటల సమయం మర్చిపోలేనిది... ప్రతి నిమిషం గుర్తుండిపోయేది..

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ రాక్షస పాలన అంతమయ్యిందంటే అందులో సింహభాగం రామోజీ రావు కృషేనడంలో అతిశయోక్తి లేదు.

సంస్కారి అన్నమాట రామోజీరావుకి చిన్నదవుతుంది... ఆయన గొప్పతనం గురించి మాట్లాడడానికి మాటలు రావడం లేదు. ఈ రాష్ట్రానికి పట్టిన పీడ వదిలించాలని... తెలుగువారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందిన రామోజీరావు

ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు రోజుల లోగానే ఈ విషాద వార్త వినాల్సి వస్తుందనుకోలేదు

ఇంకా తెలుగు ప్రజలకు ఆయన చేసిన మేలు చాలనుకున్నారేమో... ఏమిటో మరి?

రామోజీ రావు పై ఆయన కుటుంబ సభ్యులపై ఎన్నో అక్రమ కేసులను నమోదు చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం

అయినా చలించక... ప్రభుత్వ వేధింపులకు లొంగక పోరాడిన మేరునగధీరుడు రామోజీ రావు సాయంత్రంలోగా రామోజీరావు పార్థివ దేహాన్ని దర్శనం చేసుకుంటాను


ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు

## రామోజీరావుది మహాభినిష్క్రమణే

ఈనాడు సంస్థల అధినేత, పెద్దలు పద్మభూషణ్ అవార్డు గ్రహీత , చెరుకూరి రామారావు గారి మహాభినిష్క్రమణ వార్తను విన్న వెంటనే మనసును కలిచి వేసిందని ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు తెలిపారు. రామోజీ రావు ది మహాభినిష్క్రమణే అని పిలుస్తానని ఆయన చెప్పారు. మహాభినిష్క్రమణ అంటే ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు చనిపోయినప్పుడు మహాభినిష్క్రమణం అని అన్నారని పేర్కొన్నారు.

స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చనిపోయినప్పుడు కూడా ఈనాడు దినపత్రికలో మహాభినిష్క్రమణం అని పతాక శీర్షికలో వార్తా కథనాన్ని ప్రచురించారని రఘురామ కృష్ణంరాజు గుర్తు చేశారు. అది గొప్ప వారు చనిపోయినప్పుడు ఉపయోగించే పదమని పేర్కొన్న రఘురామకృష్ణం రాజు, నాకు రామోజీరావు అంటే అంతే ఇష్టం, గౌరవం, అభిమానం అనుకోండని అన్నారు.

అంత విశిష్టమైన వ్యక్తిని కలవడమే గొప్ప అనుభూతి, ఒక తీపి జ్ఞాపకమని పేర్కొన్న ఆయన, ఆరు నెలల క్రితం రామోజీ రావుని కలిశానని తెలిపారు. అంతకుముందు కొన్ని సందర్భా లలో కలిసినప్పటికీ, నిమిషం... అర నిమిషం మాత్రమే మాట్లాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఆరు నెలల క్రితం మాత్రం అరగంట సమయం ఇచ్చిన రామోజీ రావు , రెండు గంటలకు పైగా నాతో మాట్లాడడం జరిగిందని తెలిపారు.



ఈనాడు అధినేత రామోజీరావు భౌతికకాయానికి నివాళు లర్పించి, ఆయన కుమారుడిని ఓదారుస్తున్న ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

వయసులో నేను ఆయన కంటే ఎంతో చిన్నవాడినైనప్పటికీ, నన్ను కూడా మీరు అంటూ సంబోధించారని రఘురామ కృష్ణంరాజు గుర్తు చేసుకున్నారు. అయ్యా మీరు నన్ను దయచేసి మీరు అని సంబోధించవద్దని కోరగా, ఆయన వయస్సును బట్టి గౌరవ మర్యాదలు దక్కవని సున్నితంగా నా మాటను తిరస్క రించి నన్ను మీరు అంటూ అసాంతం సంబోధిస్తూనే ఉన్నారన్నారు.

జగన్మోహన్ రెడ్డి అవినీతి, అక్రమాలపై అలుపెరుగని పోరాటం చేసిన రామోజీ రావు జగన్మోహన్ రెడ్డి అవినీతి, అక్రమాలపై రామోజీ రావు అలుపెరుగని పోరాటం చేశారని రఘురామ కృష్ణంరాజు పేర్కొ న్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన అంత మయ్యిందంటే అందులో సింహ భాగం, ఈ ప్రభుత్వ అవినీతిని తూర్పారబట్టిన రామోజీరావు కారణమని చెప్పుకోవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. అటువంటి మహానుభావుడు నాకు తన విలువైన సమయాన్ని ఇవ్వడమే కాకుండా, వారి చిన్నతనంలోని ఎన్నో విషయాలను చెప్పారన్నారు.

మా తాత గారితో ఆయనకు ఉన్న స్నేహం గురించి వివరించారని తెలిపారు. రామోజీరావు , మా తాతగారు ఇద్దరూ మంచి స్నేహితులే కాకుండా, విజయవాడలో పక్కపక్కనే ఫ్యాక్టరీలను స్థాపించారని తెలిపారు. రామోజీ రావు తన జీవితంలోని ముఖ్య ఘట్టాలను, రాజకీయాలలో ప్రత్యక్షంగా లేకపోయినప్పటికీ అనేక రాజకీయ అంశాల గురించి చర్చించారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. నా జీవితంలో రామోజీ రావు తో గడిపిన ఆ రెండు గంటల సమయం మర్చిపోలేనిది. ప్రతి నిమిషం గుర్తుండి పోయేదని తెలిపారు .

నేను ఆయన్ని కలిసినది కొన్ని నెలల క్రితమేనని, అప్పటికే ఆయన అనారోగ్యంతో ఉన్నారన్నారు. ఎంతో ఎదిగినా ఒదిగి ఉండడం అన్నది ఆయన్ని చూసి నేర్చుకోవాలన్నారు. ఎంతో ఎత్తు కు ఎదిగిన, ఎంతో గొప్ప వ్యక్తిగా కీర్తి ప్రతిష్టలను సంపాదించిన ఆయన, వయసులో తన కంటే ఎంతో చిన్నవాడినైన నన్ను లిఫ్ట్ వరకు వచ్చి సాగనంపడం అంటే... అటువంటి సంస్కారం అందరికీ ఉండదన్నారు. ఏ నూటికో, కోటికో ఒక్కరికి మాత్రమే అటువంటి సమస్కారం ఉంటుందని తెలిపారు. అటువంటి మహానుభావుడిని సంస్కారి అంటే, ఆ మాట కూడా చిన్నదే అవుతుందన్నారు. రామోజీ రావు గొప్పతనం గురించి మాట్లాడడానికి మాటలు చాలవని రఘురామకృష్ణంరాజు తెలిపారు .

### ఈ రాష్ట్రానికి పట్టిన పీడ వదిలించాలన్న రామోజీరావు

ఈ రాష్ట్రానికి పట్టిన పీడను వదిలించాలి రాజుగారు అని రామోజీ రావు నాతో చెప్పారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. రాష్ట్రానికి పట్టిన పీడను వదిలించే పనిలో ఉన్నానని చెప్పారు. రాష్ట్రానికి ఎంతో అన్యాయం జరుగుతోందని, తెలుగు ప్రజలు దారుణంగా మోసపోతున్నారని, వారికి అన్ని విషయాలు తెలియజెప్పాలని రామోజీరావు నాతో అన్నారని రఘురామ కృష్ణంరాజు వివరించారు. ఈ క్షణం కోసమే ఎదురు చూసిన ఆయన ఇంకా తెలుగు ప్రజలకు చేసిన మేలు చాలనుకున్నారేమో, ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు రోజుల్లో గానే ఈ విషాద వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదన్నారు.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రామోజీ రావు పై ఎంతో కక్ష కట్టిందని, ఎన్నో అన్యాయాలు చేసిందన్నారు. రామోజీరావు పై ఆయన కోడలు శైలజా పై కూడా ఎన్నో అక్రమ కేసులను నమోదు చేసిందన్నారు. ఏ తప్పు చేయని రామోజీరావు గారిపై, తప్పు చేస్తే చర్మం తీసే రామోజీరావు పైనే ఎన్నో అక్రమ కేసులు పెట్టినప్పటికీ చలించక , లొంగక జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పోరాడిన మేరునగధీరుడు రామోజీ రావు అన్నారు.

ఆ మహానుభావుడు గురించి ఎంత చెప్పినా తక్కువేనని



అన్నారు. మా అధినాయకుడు చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ఉండడం వల్ల, నేను కూడా ఢిల్లీకి రావడం జరిగిందన్నారు. ఢిల్లీ నుంచి మధ్యాహ్నం బయల్దేరి, సాయంత్రం లోగా ఆ మహనీయుడు పార్థివ దేహాన్ని చివరి దర్శనం చేసుకుంటానని రఘురామ కృష్ణంరాజు తెలిపారు .

### ముందే సమాధి ప్రాంతాన్ని సిద్ధం చేసుకున్న రామోజీరావు

బ్రతికుండగా చావంటే ఎవరికైనా భయమేనని, ఆ చావును గుర్తు చేసుకుంటే ఇన్ని అన్యాయాలు, అరాచకాలు, అధర్మాలు, రాష్ట్రంలో, దేశంలో ఉండవని రఘురామ కృష్ణంరాజు అన్నారు. ఎన్నో సంవత్సరాల క్రితమే రామోజీ రావు రామోజీ ఫిలిం సిటీలోని ఒక ప్రాంతంలో తన సమాధి ఉండాలని, ఆ ప్రాంతాన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దారని తెలిపారు. వృక్షాలు అంటే అమితంగా ఇష్టపడే రామోజీరావు , సృష్టికి ప్రతి సృష్టి లాంటి రామోజీ ఫిలిం సిటీని తీర్చిదిద్దా రన్నారు.

ఒక సంస్థ కాకుండా, ఒక వ్యక్తే రామోజీ ఫిలిం సిటీ లాంటి ప్రతి సృష్టిని చేయడం అనేది మామూలు విషయం కాదన్నారు. ఎన్నో వేల కోట్ల రూపాయలు నష్టపోయిన ఆయన అనుకున్న కలకు రూపం కల్పించిన శిల్పి రామోజీరావు అన్నారు. అటువంటి మహానుభావుడు ఎన్నో సంవత్సరాల క్రితమే తన సమాధి ప్రాంతాన్ని కూడా ఎంపిక చేసుకున్న విషయం తెలిసి నేను నిర్ఘాంతపోయిన ఆ మహానుభావుడు భౌతికంగా ఇప్పుడు మన మధ్యలో లేకపోయినప్పటికీ, తప్పకుండా నాలాంటి లక్షలాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వతంగా ఉంటారన్నారు.

రామోజీ రావు లెగసిని ఆయన కుమారుడు కిరణ్ గారు, ఆయన కోడలు శైలజా కిరణ్ కొనసాగించాలని, వారికి రామోజీరావు మనోనిబ్బరం, ధైర్య సాహసాలను ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటూ, రామోజీరావు కి అశ్రు నయనాలతో నివాళులు అర్పిస్తున్నట్లు రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 09, జూన్ 2024

# గుంటూరులో రామోజీరావుకు ఘన నివాళి



**గుంటూరు:** నగరంలో టీడీపీ పార్టీ కార్యాలయంలో మీడియా దిగ్గజం రామోజీ రావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. తాడికొండ, ప్రత్తిపా డు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజ నేయులు, గల్లా మాధవి, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. మీడియా రంగంలో తనదైన ముద్ర వేశారని, రాజకీయ, వ్యవసాయ, వ్యాపార రంగాలలో ప్రతిఒక్కరికి దారిచూపిన మార్గదర్శకుడు, దార్శనికుడని కొనియాడారు. రామో జీ ఫిల్మ్ సిటీ అనే అద్భుతాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని, ఆయన అకాల మరణం తీరని లోటని సంతాపం తెలిపారు. మరణం లేని ఏకైక వ్యక్తి రామోజీరావు అని నివాళులర్పించారు.


## టీటీడీ ఈవో ధర్మారెడ్డి పాస్ పోర్ట్ సీజ్

**టీటీడీలో చాలా లెక్కలు తేలాల్సి ఉంది..**

**పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు ఇవ్వండి..**

**తిరుమల టోల్ గేట్ వద్ద నిఘా పెట్టండి..**

**జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్**



**తిరుపతి:** టి.టి.డి. ఈఓ ధర్మారెడ్డి పాస్పోర్ట్ ను వెంటనే సీజ్ చేయాలని, తిరుమల తిరుపతి దేవస్థానములు ఈఓ గా గత ఐదు సంవత్సరాలుగా ఎలాంటి అర్హత లేకపోయినా, ఐ.ఏ.ఎస్. కాకపో యినా, గత అధికార పార్టీ అండదండలతో తి.తి.దే. తిరుమలలో ఈఓ గా వుండి అనేక అవినీతి కార్యక్రమాలకు ఈవో ధర్మారెడ్డి పాల్పడ్డారని ఆరోపించారు.

తిరుమలలో స్వామివారి నగలు, ఆభరణాలు, శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన ఎన్నో అవినీతి కుంభకోణాలు చేసి, టీటీడీ నిధులలో ఎన్నో గోల్మాల్ చేసి, భక్తులు శ్రీవారికి సమర్పించిన హుండీ కానుకలపై సరైన లెక్కలు చూపకుండా.. ఈరోజు ప్రభుత్వం మారగానే సెలవు పెట్టి దేశం వదిలి వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్నాడని.. తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్ "కిరణ్ రాయల్" గురువారం స్థానిక పద్మావతి పురంలోని సిఐడి ఆఫీసు నందు ఫిర్యాదు చేశారు.

ధర్మారెడ్డి అవినీతి లెక్కలు చాలా తేలాల్సి ఉందని, ఆయన విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకోవాలని, టీటీడీ ఈవో ధర్మారెడ్డి పాస్ పోర్ట్ సీజ్ చేసి, లుక్ అవుట్ నోటీసులు ఇవ్వాలని, తిరుమల టోల్ గేట్ వద్ద నిఘా పెట్టాలని.. జనసేన నేతలు రాజారెడ్డి, సుభాషిని, సుమన్ బాబు మునస్వామి, కిషోర్, ఆది, సాయి, పురుషోత్తం, రాజేంద్ర, సిద్దు తదితరులతో కలిసి మీడియా ముఖంగా కిరణ్ డిమాండ్ చేశారు.

### ముంపు సమస్య పరిష్కారానికి

## సత్వరం చర్యలు చేపట్టాలి

**- అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన**

**రాజమహేంద్రవరం :** స్థానిక 11వ డివిజన్లో నెలకొన్న సమస్యలకు సత్వరం పరిష్కారం చూపించాలని నగర పాలక సంస్థ అధికారులను రాజమహేంద్ర వరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదేశించారు. సదరు డివిజన్లో



గతంలో చేపట్టిన మేజర్ డ్రైనేజీని స్థానిక టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచు కుని సదరు ప్రాంతంలో ముంపు, మురుగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్టును వెంటనే తీయించాలని, ఇంకా మిగిలిపోయిన పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేసి స్థానిక ప్రజలకు డ్రైనేజీ పరంగా ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. స్థానిక పెద్దలు అంకం గోపి, డివిజన్ ఇన్ఛార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్, అడబాల రాజా, రేగేటి నూరిబాబు, జాజుల గోవిందరాజులు, తోట కిరణ్, సత్యవేణి, రేలంగి శ్యామ్, గరికి రామారావు, నున్న నాగమణి, దేవి, బద్రి, కేబుల్ ప్రభాకర్, కోర్పు రామారావు, భవానీ, బాబురావు తదితరులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంట ఉన్నారు.

## చేప మందు పంపిణీలో విషాదం

**- తొక్కిసలాట జరిగి ఒక వ్యక్తి మృతి**


**హైదరాబాద్ :** హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో విషాదం చోటుచేసుకుంది. క్యూ లైన్లో నిలబడ్డ ఓ వ్యక్తి తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అక్కడి వారు ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్ జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు.



### మోడీ ప్రమాణ స్వీకారానికి గెస్ట్‌గా

## వందే భారత్ ట్రైన్ పైలట్

**హైదరాబాద్:** నాడు నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా ప్రమాణం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవా నికి మొత్తం 8 వేల మందికి ఆహ్వానాలు అందాయి. ఇందులో దక్షిణ రైల్వేలోని చెన్నై డివిజన్‌కి చెందిన లోకో పైలట్ ఐశ్వర్య కూడా ఉన్నారు. ప్రస్తుతం ఆమె వందేభారత్ రైలులో పనిచేస్తున్నారు. అలాగే మహారాష్ట్రకు చెందిన లోకో పైలట్ సురేఖ యాదవ్‌కి కూడా ఆహ్వానం అందింది. ఈమె ఆసియాలోనే మొట్టమొదటి మహిళా రైలు డ్రైవర్.



## 18 ఏళ్ల వయస్సులో దత్తత తీసుకోవడం చెల్లదు

**- రాజస్థాన్ హైకోర్టు**

రాజస్థాన్ హైకోర్టు దత్తపుత్రుడికి కారుణ్య నియా మకాన్ని తిరస్కరించింది,18 సంవత్సరాల వయస్సులో అతని దత్తత హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, 1956లోని సెక్షన్ 10(4) ప్రకారం చట్టబద్ధమైన అవసరానికి ప్రత్యక్ష విరుద్ధంగా ఉందని పేర్కొంది.

ప్రభుత్వోద్యోగి అయిన తన తండ్రి మరణించడంతో కారుణ్య నియామకం కోసం దత్తపుత్రుడు (పిటిషనర్) దాఖలు చేసిన పిటిషన్‌ను జోధ్‌పూర్ బెంచ్ కొట్టివేసింది. అక్రమ దత్తత దస్తావేజు కారణంగా కొడుకు దరఖాస్తును తిరస్కరించిన అధికారుల నిర్ణయాన్ని తీర్పు సమర్థిం చింది.

జస్టిస్ అరుణ్ మోంగా సింగిల్ బెంచ్ , " ప్రస్తుత కేసులో, పిటిషనర్ 13.12.2013న దత్తత తీసుకునే సమయానికి అతని వయస్సు 18 సంవత్సరాలు అని అతని సర్టిఫికేట్ ద్వారా నిర్ధారించబడింది.

తన తండ్రి మరణానంతరం కారుణ్య నియామకం



కోసం పిటిషనర్ చేసిన దరఖాస్తు నిర్ణీత గడువులోగా సమర్పించినప్పటికీ తిరస్కరించబడింది. మరణించిన వారి సర్వీస్ రికార్డ్‌లో పిటిషనర్ నామినీగా నమోదు చేయబడలేదని మరియు హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్, 1956 (చట్టం)లోని సెక్షన్ 10(iv)ని సూచించారని ప్రతివాదులు వాదించారు.

నిబంధన ప్రకారం, పిటిషనర్ తన దత్తత సమయంలో 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నందున దత్తత చట్టబద్ధంగా పరిగణించబడదు. అతని దత్తత సమయంలో, పిటిషనర్ వయస్సు 18 సంవత్సరాలు మరియు 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న దత్తతను అనుమతించే ప్రత్యేక ఆచారం లేదని కోర్టు పేర్కొంది. కాబట్టి, చట్టంలోని సెక్షన్ 16 కింద ఉన్న ఊహ వర్తించదు.

చట్టంలోని సెక్షన్ 10(iv) యొక్క అవసరాలకు అనుగుణంగా పర్యవసానంగా, పిటిషనర్ యొక్క దత్తత కారుణ్య నియామకాన్ని క్లెయిమ్ చేయడానికి చట్టబద్ధమైన అవసరాలను తీర్చలేదని కోర్టు పేర్కొంది. దీంతో హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది.





## కట్టుదిట్టంగా చంద్రబాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లు

**సభా ప్రాంగణం చదును పనులను పూర్తిచేయాలి**

**ప్రధాని, సీఎంలు, గవర్నర్ కాన్వాయ్‌కు దారి కల్పించాలి**

**పార్కింగ్, అప్రోచ్ రహదారులను బాగుచేయించండి**

**ప్రముఖులకు వసతి, పాసులకు చర్యలు తీసుకోవాలి**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న ఆదేశం**

**మచిలీపట్నం:** ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార ఏర్పా ట్లు కట్టుదిట్టంగా చేపట్టాలని రాష్ట్ర రవాణా, రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం గన్న వరం విమానాశ్రయంలోని కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర అదనపు డీజీ ఎస్.బాగ్చి, ఐజీలు రాజశేఖర్‌బాబు, అశోక్‌కుమార్, పోలీస్ కమిషనర్ రామకృష్ణ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డి.కె.బాలాజీ, ఢిల్లీ రావు, జిల్లా పోలీసు అధికారి అద్నా న్ నయీం అస్మిలతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12న చంద్రబాబు ప్రమాణస్వీకారా నికి గన్నవరం మండలం కేసరపల్లి ఐటీ పార్కు మేధ టవర్స్ సమీపంలో స్థలాన్ని ఎంపిక చేశామన్నారు.

**సభా ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేయండి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకోసం ప్రధాన సభ ప్రాంగణాన్ని బాగా చదును చేసి ముళ్లపొదలను తొలగించే పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అక్కడ వేదిక, బారికేడిరగ్, బ్లాక్‌ల విభజన, పారిశుధ్యం తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే



ప్రముఖులకు వసతి, పాసులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సభకు వచ్చే అతిథులకు, ప్రజలకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఆహారం తదితర లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు, ప్రముఖులకు, ప్రజలకు, మీడియా వారికి అవసరమైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.


**పార్కింగ్, అప్రోచ్ రహదారులను బాగుచేయించాలి**

ఎంపిక చేసిన లేఅవుట్, గంగరాజు, విమానాశ్రయం, వెటర్నరీ కళాశాల, మేధా టవర్స్, పెట్రోల్ బంకు దగ్గర పార్కింగ్ ప్రదేశాల నుంచి ప్రధాన సభకు చేరుకునేం దుకు వీలుగా అప్రోచ్ రహదారులను బాగుచేయాలని తెలిపారు. ప్రధానమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్య మంత్రులు, గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రధాన సభ వేదిక వద్దకు రాకపోకలు, గవర్నర్ రాకపోకల కాన్వాయ్‌కు ఎటువంటి అడ్డంకులు లేకుండా పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందు లు, అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సంయుక్త కలెక్టర్లు గీతాంజలి శర్మ, సంపత్ కుమార్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడుకర్, విజయవాడ డీసీపీ అధిరాజ్ ఎస్.రానా, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి పాల్గొన్నారు.

## మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి 8000 మంది

**న్యూఢిల్లీ, మహానాడు:**

భారతీయ జనతా పార్టీ నేత నరేంద్ర మోడీ కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. భారత ప్రధానిగా ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం జూన్ 9 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరగనుంది. శుక్రవారం బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) కూటమి సమావేశంలో మోడీని పార్లమెంటరీ నేతగా ఎన్నుకుంది. దాంతో ఆయన మూడోసారి భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమం అయింది. హ్యాట్రిక్ విజయంతో వరుసగా మూడవసారి దేశానికి ప్రధాని అవుతున్న నేపథ్యంలో నరేంద్ర మోడీ తన ప్రమాణ స్వీకారానికి పారిశుద్ధ్య కార్మికులు, వైద్యులు, కళాకారులు, సాంస్కృతిక ప్రదర్శనకారులు, ప్రభాశీలులు సహా వివిధ రంగాలకు చెందిన 8,000 మంది వరకు హాజరు కానున్నట్టు భావిస్తున్నారు. అలాగే, 'వికసిత్ భారత్ అంబాసిడర్లు 'గా వందే భారత్, మెట్రో రైళ్లలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగులు, ప్రభుత్వ లబ్దిదారులు కూడా హాజరు కానున్నారు. ప్రత్యేక అతిథుల జాబితాలో గిరిజన



మహిళలు, పారిశుధ్య కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో పాల్గొన్న కార్మికులు కూడా ఉన్నారు. గతేడాది ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో ఉన్న సిల్క్యారా సొరంగం కూలిన ఘటనలో చిక్కుకున్న 41 మంది నిర్మాణ కార్మికులను రక్షించడంలో శ్రమించిన ర్యాట్-హోల్ మైనర్‌లను కూడా ప్రధానమంత్రి కార్యాలయం అధికారులు ఆహ్వానించారు.

అతిథుల జాబితాలో బీజేపీ జాతీయ ఆఫీస్ బేరర్లు, నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ(ఎన్ఈసీ) సభ్యులు, ఔట్‌గోయింగ్ పార్లమెంటేరియన్లు, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌లు కూడా ఉన్నారు. వివిధ మతాలకు చెందిన 50 మంది ప్రముఖ మత పెద్దలకు కూడా ఆహ్వానం అందింది. పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత లతో పాటు దేశానికి, సమాజానికి సేవలు చేయడం ద్వారా మోడీ 'మన్ కీ బాత్'లో పాల్గొన్నవారు కార్య క్రమానికి విచ్చేయనున్నారు.

**ప్రపంచ నేతల హాజరు**

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ప్రమాణ స్వీకార మహోత్సవానికి ప్రపంచ నేతలు కూడా హాజరు కానున్నారు. వారిలో 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానం కింద ప్రభుత్వం బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే రానున్నారు. అలాగే, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్, మారిషస్ పీఎం ప్రవింద్ జుగ్నాథ్, సీషెల్స్ వైస్-ప్రెసిడెంట్ అహ్మద్ అఫీఫ్‌లకు ఆహ్వానం అందింది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ మయిజూ ముఖ్యమైన ఆహ్వానితులుగా ఉన్నారు.

8

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 09, జూన్ 2024




**ప్రముఖ మీడియా అధినేత రామోజీ రావు శనివారం తుదిశ్వాస విడిచారు. 'ఉషాకిరణ్ మూవీస్'తో సినీ పరిశ్రమపైనా రామోజీరావు తనదైన ముద్ర వేశారు. తెలుగు, కన్నడ, హిందీ సహా పలు భాషల్లో 80కిపైగా ఫీల్ గుడ్ చిత్రాలు నిర్మించారు. ఎందరో నటులు, దర్శకులు, సంగీత దర్శకులను పరిచయం చేశారు. కీరవాణి, శ్రీకాంత్, ఉదయ్ కిరణ్, తరుణ్, డైరెక్టర్ తేజ, జెనీలియా, శ్రియ మొదలైన ప్రముఖులు అలా వచ్చిన వారే. ఆయన సినిమాల్లో 'నువ్వే కావాలి'కి జాతీయ అవార్డు రాగా మరికొన్నింటిని నంది అవార్డులు వరించాయి.**

### రామోజీరావు నిర్మించిన ప్రముఖ సినిమాలు

శ్రీవారికి ప్రేమలేఖ(1984), మయూరి(1985), మౌన పోరాటం(1989), ప్రతిఘటన(1987), పీపుల్స్ ఎన్‌కౌంటర్ (1991), అశ్వని(1991), మెకానిక్ మామయ్య(1999), మూడుముక్కలాట (2000), చిత్రం, నువ్వే కావాలి(2000), ఇష్టం(2001), ఆనందం (2001), ఆకాశ వీధిలో(2001), నిన్ను చూడాలని(2001), తుఝె మేరీ కసమ్, వీధి(2005), నచ్చావులే(2008), నిన్ను కలిశాక(2009), దాగుడుమూత దండాకోర్(2015) వంటి 87 సినిమాలను రామోజీరావు నిర్మించారు.

### చిత్రసీమతో అనుబంధం

రామోజీ రావుకు తెలుగు ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉంది. రోజు ఉదయం చదివే ఈనాడు దినపత్రిక. అటు మీడియా రంగంలో ఈటీవీ వంటివి తెలుగు ప్రజలతో పెనువేసుకుపోయింది. అంతేకాదు.. ఈనాడు పత్రిక వ్యవస్థాపకుడిగా.. ప్రచురణకర్తగా.. అటు చిట్ ఫండ్ రంగంలో మార్గదర్శి చిట్ ఫండ్స్.. పచ్చళ్ల వ్యాపారంలో ప్రియా పచ్చళ్లు..

### 80కిపైగా చిత్రాలు

ఇదిలా ఉంటే, రామోజీరావు నిర్మాతగా అనేక హిట్ సినిమాలను అందించారు. ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్‌పై 80కి పైగా చిత్రాలను ఆయన నిర్మించారు. అయితే, ఆయన చేసిన ప్రతి సినిమాతో కనీసం ఒక్కరినైనా కొత్తవారిని సినీ ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఓ మూవీతో హీరోను ఇంట్రడ్యూస్ చేస్తే మరో సినిమాతో హీరోయిన్, ఇంకో చిత్రంతో డైరెక్టర్ ఇలా కొత్త వారిని ఎంకరేజ్ చేశారు.

### 42 లక్షల బడ్జెట్-12 కోట్ల కలెక్షన్స్

అలాంటిది ఒకే ఒక్క సినిమాతో ఏకంగా ఐదుగురిని చిత్ర







# నింగికేగిన 'ఉషా కిరణం'

అటు కళాంజలి..ఉషా కిరణ్ మూవీస్ అధినేతగా పలు విజయ వంతమైన చిత్రాల నిర్మాతగా తెలుగు ప్రజలతో ఆయన అనుబంధం ముడిపడి ఉంది. అంతేకాదు ప్రపంచంలో అందరు అబ్బుర పరిచే వరల్డ్ లోనే అతిపెద్ద సినీ స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీతో కూడా ఆయన తనదైన ముద్ర వేసారు. ఇక్కడ తెలుగు, హిందీ, వివిధ భాషల చిత్రాలతో పాటు హాలీవుడ్ సహా పలు అంతర్జాతీయ సినీ ప్రియులు ఇక్కడ షూటింగ్ కోసం ఇక్కడి వచ్చి సినిమాకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకోవడం వంటివి రామోజీ దార్శనికతకు నిదర్శనం. తెలుగు ప్రజలతో పాటు దేశ ప్రజలకు చేసిన సేవలకు గాను 2016లో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆయనకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్ తో గౌరవించింది.

ఆయన మృతితో తెలుగు పాత్రికేయ రంగానికి తీరని లోటు. అప్పట్లో అన్న ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ అధికారం లోకి రావడంలో రామోజీకి చెందిన ఈనాడు కీలక భూమిక పోషించింది. ఆ తర్వాత అన్నగారి పదవీచ్యుతుడు కావడంతో పాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా గద్దెను ఎక్కడంలో రామోజీకి చెందిన ఈనాడు కీలక భూమిక వహించిందని రాష్ట్రంలోని సీనియర్ రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. అంతేకాదు ఈయన్ని కొంతమంది రాజగురువుగా అభివర్ణిస్తుంటారు. అంతేకాదు తెలుగు పాత్రికేయ రంగంలో మీడియా మొఘల్ గా అభివర్ణిస్తుంటారు.

### ట్రెండ్ సెట్టింగ్ సినిమాలు


రామోజీరావు సినిమా రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. ట్రెండ్‌కి తగ్గట్టు సినిమాలు నిర్మించడంలో ఆయనకి ఆయనే సాటి. 1999లో ఆయన కొన్ని ట్రెండ్ సెట్ చేసిన సినిమాలు తీశారు ఉషాకిరణ్ మూవీస్ అధినేత రామోజీరావు. ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్ పై రామోజీరావు నిర్మాణ సారథ్యంలో వచ్చిన 'చిత్రం','నువ్వే కావాలి' చిత్రాలు 1999లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచాయి. చిత్రం సినిమాతో తేజ అనే నూతన దర్శకుడిని ఇండస్ట్రీకి పరిచయం చేస్తూ రామోజీరావు నిర్మించిన ఈ చిత్రం ఎంత పెద్ద హిట్టైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాతో చాలా మంది నటీనటులని ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఇంటర్ చదివే హీరో, హీరోయిన్స్ చదువు పూర్తి కాక మునుపే పేరెంట్స్ అయితే ఎలా ఉంటుందనే స్టోరీలైన్ తో వచ్చిన ఈ సినిమా రికార్డు విజయం సాధించింది.

ఇక రామోజీరావు నిర్మించిన మరో చిత్రం 'నువ్వేకావాలి'. 'నిరమ్' అనే మలయాళ మూవీ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో హీరో, హీరోయిన్లుగా తరుణ్, రిచా పల్లోడ్ నటించారు. ఫ్రెండ్స్ గా ఉన్న హీరో, హీరోయిన్స్ తమ మధ్య ఉన్నది ఫ్రెండ్ షిప్ మాత్రమే కాదు ప్రేమని చివరకు తెలుసుకోవడం తో కథ సుఖాంతం అవుతుంది. కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రామోజీరావు నిర్మాణంలో ఈ చిత్రం రూపొందింది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ సినిమాకు డైలాగ్స్ తో పాటు స్క్రీన్ ప్లే అందించారు. కోటి అందించిన మ్యూజిక్ సినిమాకు హైలైట్ గా నిలిచింది. ఈ చిత్రం తరుణ్ కెరీర్‌లోనే పెద్ద హిట్‌గా నిలిచింది. రామోజీరావు ఇవే కాకుండా ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్ లో శ్రీవారికి ప్రేమలేఖ, మయూరి, మౌన పోరాటం, ప్రతిఘటన, మూడు ముక్కలాట, చిత్రం, వంటి పలు చిత్రాలను నిర్మించారు.

### ఒక్క 'చిత్రం' - ఇండస్ట్రీకి ఐదుగురు నటులు

రామోజీరావు నిర్మించిన చిత్రం సినిమాతో ఏకంగా ఐదుగురు ఆర్టిస్ట్లు పరిచయం అయ్యారు. హీరో, హీరోయిన్, డైరెక్టర్, సింగర్, కమెడియన్‌లా ఐదుగురు ఒకే ఒక్క సినిమాతో పరిచయం చేసిన ఘనత రామోజీరావుకు దక్కింది.




పరిశ్రమకు పరిచయం చేశారు నిర్మాత రామోజీరావు. ఆ సినిమా పేరే చిత్రం. 2000 సంవత్సరంలో వచ్చిన ఈ సినిమా ఎంత పెద్ద హిట్ కొట్టిందో తెలిసిందే. కేవలం రూ. 42 లక్షల బడ్జెట్‌తో తెరెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 12 కోట్ల కలెక్షన్స్ కొల్లగొట్టినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి.

### డైరెక్టర్‌గా తేజ

2000, మే 25న చిత్రం సినిమాతో డైరెక్టర్ నుంచి సింగర్ వరకు ఐదుగురు సినీ ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. వారిలో మొదటగా చెప్పుకోవాల్సింది డైరెక్టర్ తేజ సినిమాటోగ్రాఫర్ అయిన తేజకు చిత్రం సినిమాతో దర్శకుడిగా మారే అవకాశం ఇచ్చారు రామోజీరావు. ఆ తర్వాత స్టార్ డైరెక్టర్‌గా తేజ పాపులర్ అయ్యారు. మహేశ్ బాబు, దగ్గుబాటి రానాతోపాటు పలువురు కొత్తవారితో సినిమాలు తెరకెక్కించారు డైరెక్టర్ తేజ.

### హీరోగా ఉదయ్ కిరణ్

చిత్రం సినిమాతో హీరోగా ఇండస్ట్రీకి పరిచయం అయ్యాడు ఉదయ్ కిరణ్. తమిళ సినిమాల్లో నటుడిగా చేస్తున్న ఉదయ్ కిరణ్ చిత్రం మూవీతో తెలుగులో హీరోగా మంచి హిట్ కొట్టాడు. ఆ తర్వాత నువ్వే నువ్వే, మనసంతా నువ్వే సినిమాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద హిట్ అయ్యాయి. దాంతో ఎంట్రీతోనే హ్యాట్రిక్ కొట్టిన హీరోగా ఉదయ్ కిరణ్ నిలిచిపోయాడు.

### రీమా సేన్

మోడల్ అయిన రీమా సేన్ తెలుగులో చిత్రం సినిమాతో హీరోయిన్‌గా డెబ్యూ చేసింది. ఆ తర్వాత తమిళం, హిందీ సినిమాలతో బిజీగా మారింది. అలాగే యాక్టర్ అయినటువంటి సందీప్ ఈ మూవీతో సింగర్‌గా మారాడు. ప్రేమాయనమః, ఇంకోసారి చిత్రాల్లో నటించిన సందీప్ టాలీవుడ్, బాలీవుడ్ ప్లే బ్యాక్ సింగర్‌గా ఎదిగాడు. అలాగే పాపులర్ టీవీ షో అయిన జీ సరెగమపకు యాంకర్‌గా వ్యవహరించాడు.

### చిత్రం శ్రీను

చిత్రం మూవీతో కమెడియన్‌గా ఎంట్రీ ఇచ్చిన శ్రీను మంచి పేరు తెచ్చుకున్నాడు. ఈ మూవీ నేమే తన ఇంటి పేరుగా మారిపోయింది. ఆ తర్వాత దాదాపుగా 260కిపైగా సినిమాల్లో నటుడిగా చిత్రం శ్రీను అలరించాడు. ఇలా ఒక్క సినిమాతో ఐదుగురిని పరిచయం చేసిన నిర్మాతగా రామోజీరావు ఘనత సాధించారు. వీళ్లే కాకుండా, జూనియర్ ఎన్టీఆర్, శ్రీయ సరన్, జెనిలీయా, రితేష్ దేశ్ ముఖ్, తరుణ్, యామీ గౌతమ్, ఆకాష్ తదితరులను రామోజీ రావు ఇంట్రడ్యూస్ చేశారు.

## సంతాపాలు...

### నూటికో కోటికో ఒక్కరే ఉంటారు : తారక్

రామోజీ రావు మృతిపై హీరో జూనియర్ ఎన్టీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన లాంటి దార్శనీకులు నూటికో కోటికో ఒక్కరే ఉంటారు అంటూ వ్యాఖ్యానించారు.

"శ్రీ రామోజీ రావు గారు లాంటి దార్శనీకులు నూటికో కోటికో ఒకరు. మీడియా సామ్రాజ్యాధినేత, భారతీయ సినిమా దిగ్గజం అయినటువంటి ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనటువంటిది. ఆయన మన మధ్యన ఇక లేరు అనే వార్త చాలా బాధాకరం. 'నిన్ను చూడాలని' చిత్రంతో నన్ను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసినప్పటి జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేను. ఆ మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు.

### అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారు : పవన్ కల్యాణ్

అక్షరయోధుడు రామోజీరావు తుదిశ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాను , ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా, ఆయన స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనమే. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారు. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ను వేదికగా చేశారు. ఆయన కుటుంబానికి నా తరఫున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా నని అన్నారు పవన్ కల్యాణ్.

### చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలు సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి: కల్యాణ్‌రామ్

"రామోజీరావు భారతీయ మీడియా, చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలు చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి".

### రామోజీకి భారతరత్న ఇవ్వడమే ఘనమైన నివాళి: రాజమౌళి

"తన కృషితో లక్షలాది మందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి రామోజీరావు. 50 సంవత్సరాల నుంచి ఎంతోమందికి జీవనోపాధి కల్పిస్తున్నారు. 'భారతరత్న'తో ఆయనను సత్కరించడమే మనమిచ్చే ఘనమైన నివాళి".

### నా గాడ్‌ఫాదర్ మృతి పరిశ్రమకు తీరని నష్టం: నరేశ్

"రామోజీ రావు గారు మరణించారనే హృదయ విదారక వార్త విని బాధపడ్డా. ఆయన నా సినీ కెరీర్‌కు పునాది వేశారు. నా గాడ్ ఫాదర్, నా స్ఫూర్తి. తెలుగు చిత్రపరిశ్రమను గొప్ప స్థాయికి తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి. ఆయన మృతి పరిశ్రమకు తీరని నష్టం. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నా"

### రామోజీరావు నిజమైన దార్శనికుడు : వెంకటేశ్

రామోజీరావు నిజమైన దార్శనికుడు, భారతీయ మీడియాలో ఆయన విప్లవాత్మక కృషి చేశారు. జర్నలిజం, సినీ రంగంలో ఆయన చేసిన కృషి ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఆత్మకు శాంతి కలగాలి.

### తెలుగు పత్రికా రంగంలో రామోజీ రావు మకుటం లేని మహారాజు : నందమూరి బాలకృష్ణ

"తెలుగు పత్రికా రంగంలో రామోజీ రావు మకుటం లేని మహారాజు. తెలుగులోనే కాదు దేశ పత్రికా రంగంలో ఓ కొత్త ఒరవడిని సృష్టించారు. భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శిగా నిలిచారు. చిత్రసీమలో అదే తీరున సాగి ఉషోదయ కిరణాలను ప్రసరింపజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడియోగా రామోజీ ఫిలిం సిటీని తెలుగు నేలపై నెలకొల్పారు. మా తండ్రి నందమూరి తారక రామారావుతో ఆయన అనుబంధం ప్రత్యేకమైంది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను".

### లరామోజీ మరణం తెలుగు జాతికి తీరని లోటు : సినీ నిర్మాత అశ్వనీదత్

"ఏ రంగంలో అయినా, ఎలాంటి నేపథ్యం లేకపోయినా కష్టపడితే చాలు విజయం దక్కుతుంది అనే స్ఫూర్తిని నాలాంటి ఎంతోమందికి పంచిపెట్టిన రామోజీరావు జన్మ ధన్యం. తెలుగు కీర్తిని, స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఆయన మరణం ఈ దేశానికి, ముఖ్యంగా తెలుగు జాతికి తీరని లోటు".

### రామోజీ నుంచి జీవిత పాఠాన్ని నేర్చుకున్నా: మంచు విష్ణు

రామోజీరావు గారి మృతి చాలా బాధాకరం. ఆయన్ని కలిసిన ప్రతిసారి ఎంతో లోతైన జీవిత పాఠాన్ని నేర్చుకున్నాను. ఆయన తెలివి, ధైర్యం, నాపై చెరగని ముద్ర వేశాయి. సినీ













పరిశ్రమకు కూడా ఆయన ఎప్పుడూ అండగా నిలిచారు. జర్నలిజం, వినోద రంగంలో అసమానమైన ప్రమాణాలను నెలకొల్పి గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఎంతో మందికి స్ఫూర్తి. ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక సానుభూతి తెలియచేస్తున్నా.

### నా గురువు, శ్రేయోభిలాషి రామోజీరావు అస్తమయం నన్ను బాధించింది : రజినీకాంత్

"జర్నలిజం, సినీ రంగాల్లో రామోజీరావు చరిత్ర సృష్టించారు. రాజకీయాల్లో రామోజీరావు కింగ్ మేకర్.రామోజీరావు నా జీవితంలో గొప్ప ప్రేరణ, మార్గదర్శకులు నా గురువు, శ్రేయోభిలాషి రామోజీరావు అస్తమయం నన్ను బాధించింది"

### రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు : చిరంజీవి

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు పార్థివదేహానికి టాలీవుడ్ మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి నివాళు లర్పించారు. మీడియా సంస్థల అధినేత భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం చిరంజీవి మీడియాతో మాట్లాడారు. రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు. ఆయన మరణంతో తెలుగు జాతి ఓ పెద్దదిక్కును కోల్పోయిందన్నారు. రామోజీరావు కలలను, ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజారాజ్యం స్థాపించే సమయంలో ఆయన సలహాలు, సూచనల కోసం కలిసేవాడినని గుర్తు చేసుకున్నారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144